
ధర్మంచండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ వివాహాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

CORPORATE COMMERCE™
College for Practical Exposure
MEC / CEC
B.Com / BBA
Coming soon @ Ameerpet
Beside Sarathi Studios
www.corporatecommerce.in

CA. China Masthan T
94188 66666

సంపుటి : 23 | సంచిక : 262 | ది. 25-12-2024 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

చదువుకున్న మహిళలు గృహిణిలుగా ఇళ్లలో మిగిలిపోకూడదు

● వర్క్ ఫ్రం హెూమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు ఉపాధి మార్గాలు ● మహిళలను ఇంటికి పరిమితం చేయడం మారాలి..వారికి అవకాశాలు కల్పించాలి :- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో సమీక్ష చేశారు. కో-వర్కింగ్ స్పేస్, వర్క్ ఫ్రం హెూమ్‌తో మానవ వనరుల సమర్థ వినియోగం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి ట్రైనింగ్ ఇచ్చి అవకాశాలు కల్పించాలని... అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ క్రియేట్ చేయాలని సీఎం అన్నారు. చదువుకున్న మహిళలు గృహిణిలుగా మిగిలిపోకూడదు, వారికి అవకాశాలు కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. వర్క్ ఫ్రం హెూమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు విస్తృతంగా అవకాశాలు లభిస్తాయన్నారు. మహిళలను ఇంటికి, ఇంటి పనికి పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. ఇప్పటికీ చదువుకున్న మహిళలు ఇళ్లల్లో ఉంటున్నారని... వారికి వర్క్ ఫ్రం హెూమ్ అందుబాటులోకి తెస్తే ఆన్‌లైన్ విధానంలో పనిచేసి ఉపాధి పొందుతారని అభిప్రాయపడ్డారు. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉందని, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి అవకాశాలు కల్పిస్తే... ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ల ఏర్పాటులో 2025 డిసెంబర్ చివరినాటికి 1.50 లక్షల సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఒక్కో సీటుకు 50-60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని.. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభుత్వ భవనాల్లో 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతమంది వర్క్ ఫ్రం హెూమ్‌లో పనిచేస్తున్నారు, వారి అవసరాలు ఏంటనే సమాచారం సేకరించాలని అధికారులకు సీఎం సూచించారు. అదే విధంగా ఇప్పటికే నిర్ణయించినట్లు రతన్ టాటా ఇన్నో వేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో 5 చోట్ల భవనాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఆ ప్రాంతంలోని పరిశ్రమలను, విద్యా సంస్థలను ఇన్నోవేషన్ హబ్‌లకు అనుసంధానం చేయాలని సీఎం నిర్దేశించారు.

జస్టిస్ జి.నరేందర్ తీర్పులు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం

రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

అమరావతి,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : న్యాయ వ్యవస్థ ప్రాథమిక సూత్రాలను ప్రతిబింబించే విధంగా న్యాయమూర్తి జిస్టిస్ జి.నరేందర్ ఇచ్చిన పలు తీర్పులు భవిష్యత్తు తరాల న్యాయమూర్తులకు, న్యాయవాదులకు మార్గదర్శకంగా ఉంటాయని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలు అందజేస్తున్న జస్టిస్ జి.నరేందర్ ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులై వెళుతున్న సందర్భంగా మంగళవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ సేవలను కొనియాడారు. హైకోర్టు న్యాయమూర్తిగా స్వల్పకాలమే వీరు పనిచేసినప్పటికీ, పెద్ద సంఖ్యలో పలు కేసులను సునాయాసంగా పరిష్కరించి అందరికి ఆదర్శనంగా నిలిచారన్నారని అభినందించారు. పలు కేసుల్లో వీరు ఇచ్చిన తీర్పులు న్యాయ వ్యవస్థ ప్రాథమిక సూత్రాలపై వీరికి ఉన్న అపారమైన జ్ఞానాన్ని, అవగాహనను ప్రతిబింబే విధంగా ఉన్నాయని, అవి భవిష్యత్తు తరాల వారికి మార్గదర్శంగా ఉంటాయనడంలో ఎటు వంటి సందేహం లేదని ప్రశంసించారు. ఏ.పి. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా జస్టిస్ జి.నరేందర్ స్వల్ప కాలమే పనిచేసినప్పటికీ రెండు సార్లు జాతీయ లోక్ అథాలత్ లను నిర్వహించి దీరకాలికంగా పెండింగ్ లో ఉన్న పలు కేసులను పరిష్కరించారని అభినందించారు. ఈ ఏడాది సెప్టెంబరు 14 న నిర్వహించిన జాతీయ లోక్ అథాలత్ లో దాదాపు 78,937 పెండింగ్ కేసులను, 48,106 ప్రిలిటిగేషన్ కేసులను పరిష్కరించారన్నారు. ఈ నెల 14 న నిర్వహించిన మరో జాతీయ లోక్ అథాలత్ లో రికార్డు స్థాయిలో 1,22,977 కేసులను పరిష్కరించారని అభినందించారు. విజయవాడలోని ఒక ప్రైవేటు పాఠశాలలో వైద్య శిభిరాన్ని నిర్వహించి 57 మంది బదిరులకు వినికిడి పరికరాలు పంపిణీచేయించారని, అంధులకు వైద్య పరీక్షలు చేయించి ఇద్దరు అంధులకు తిరిగి చూపు వచ్చేలా వీరు ప్రయత్నించడం ఎంతో అభినందనీయమైన విషయమన్నారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరు మాసాల్లో జాతీయ మహిళా కమిషన్ సమన్వయంతో దాదాపు 5,460 మంది మహిళలకు న్యాయ అవగాహన సదస్సులను నిర్వహించారన్నారు. వీరి నేతృత్వంలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ మండల లీగల్ సర్వీసుల ద్వారా దాదాపు 110 దివ్యాంగుల పాఠశాలలు, గృహాల్లోని దివ్యాంగుల జీవన స్థితిగతులు, ఆహార భద్రత, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై తనిఖీ చేయించారన్నారు. పరిపాలనా మరియు న్యాయ పరంగానే కాకుండా పలు కమిటీల్లో సభ్యులుగా వ్యవహరిస్తూ వీరు న్యాయ వ్యవస్థకు గుణనీయమైన సేవలు అందజేశారని ప్రశంసించారు. ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్గా మరింత ఉత్తమ మైన సేవలు అందజేసి మంచి పేరుప్రఖ్యాతలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులై వెళుతున్న జస్టిస్ జి.నరేందర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేవలం 14 మాసాలే విధులు నిర్వహించినప్పటికీ తోటి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ వ్యవస్థ అధికారులు, సిబ్బంది చూపి ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. వీటికి తోడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తనపై మంచి ప్రేమాభిమానలు చూపడంతో పాటు తన విధులను సంతృప్తి కరంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను పూర్తి స్థాయిలో అందజేయడం వల్లే తాను ఈ 14 మాసాలు తన విధులను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, తాను సాధించిన విజయాల్లో సగం క్రెడిట్ వారికే చెందుతుందంటూ కృతజ్ఞతలు తెలిపారు. తాను సాధించిన విజయాల్లో బార్ సభ్యుల సహకారం కూడా మరువలేనిదంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అడ్వొకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం మరియు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు మాట్లాడుతూ జస్టిస్ జి.నరేందర్ న్యాయ వ్యవస్థకు ఉత్తమమైన సేవలు అందించారని కొనియాడారు. అత్యంత నిరాడంబరంగా జరిగిన ఈవీడ్కోలు కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయ మూర్తులు, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ సి.ఏం.వైయస్ జగన్ క్రిస్మస్ శుభాకాంక్షలు

కడప,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులందరికీ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయ-స్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవా ళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని శ్రీ వైయస్ జగన్ పేర్కొన్నారు. తద్వారా, మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని చెప్పారు. దుర్మార్గం నుంచి సన్మార్గానికి, అమానుషత్వం నుంచి మానవత్వానికి, చెడు నుంచి మంచికి, దురాశ నుంచి దాతృత్వం, త్యాగాలకు జీసస్ బాటలు వేశారని తెలిపారు. క్రీస్తు బోధనలు మనుషులందరినీ ఎప్పటికీ సన్మార్గంలో నడిపిస్తాయని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ పేర్కొన్నారు.

యుద్ధప్రాతిపదికన మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : వరద ముంపునుంచి ఖమ్మం ప్రజలకు శాశ్వతంగా విముక్తి కల్పించేందుకు గాను చేపట్టిన మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో రిటైనింగ్ వాల్ పనుల పురోగతిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్‌సీ అనిల్ కుమార్ తదతరులు పాల్గొన్నారు. ఈసమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మున్నేరు ముంపు నుంచి ఖమ్మం పట్టణాన్ని కాపాడేందుకు నదికి ఇరువైపులా ఆర్ సిసి కాంక్రీట్ గోడలు నిర్మిస్తున్నామని, ఖమ్మం నగరంలో ముంపునకు అవకాశం లేకుండా సరైన మార్గంలో వరద ప్రవాహాన్ని నడిపించేందుకు సరైన డిజైన్ తో వాల్ నిర్మించాలని అధికారులకు సూచించారు. వాల్ నిర్మాణపనులు మరింత వేగం పెరగాలని , నెలలో రెండు సార్లు స్వయంగా తానే పర్యవేక్షిస్తానని అన్నారు. ఈ వాల్ నిర్మాణానికి అవసరమయ్యే భూ సేకరణను చేపట్టాలని ఇందుకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ఖమ్మం జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. వాల్ నిర్మాణానికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 1969 నుంచి 2024 సెప్టెంబర్ వరకు వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకొని వాల్ నిర్మించాలని అన్నారు. ఇటు ఖమ్మం అటు పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు సౌకర్యం కల్పించేలా సుమారు 23 కిలోమీటర్ల మేర వాల్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు

యూనివర్సిటీలను సరస్వతీ నిలయాలుగా మార్చే దిశగా అడుగులు

● భ్రష్టుపట్టిన వ్యవస్థను గాడిలో పెట్టడమే లక్ష్యంగా చర్యలు ● ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉన్నత విద్యలో సంస్కరణలు! ● ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, పరిశోధన, ప్రమాణాలకు పెద్దపీట ● ఆరునెలల్లోనే అనూహ్య మార్పులకు మంత్రి లోకేష్ శ్రీకారం

అమరావతి,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : ఉన్నత విద్యావంతుడైన వ్యక్తి రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో ఆచరణాత్మకకంగా చూపుతున్నారు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరునెలల్లో ఉన్నత విద్యారంగంలో సమూల ప్రక్షాళనకు నడుంకట్టారు నారా లోకేష్. రాబోయే అయిదేళ్లలో విద్యావ్యవస్థను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరునెలల్లో పరిశోధన, ప్రమాణాల మెరుగుదలకు పెద్దపీట వేస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఏకీకృత చట్టం అమలుకు కసరత్తు ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల్లో ఏళ్లతరబడి ఖాళీగా ఉన్న సుమారు 3,300 పోస్టుల భర్తీకి రూట్ మ్యాప్ రూపొందించారు. అను సంధన్ ప్రాజెక్ట్ కింద పరిశోధనల ప్రోత్సాహానికి ఐదు విశ్వవిద్యాలయాలను గుర్తించారు. యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం పూర్తిచేసి, బయటకు వచ్చే ఏ విద్యార్థి నిరుద్యోగిగా ఉండరాదన్న లక్ష్యంతో సరికొత్త విద్యావ్యవస్థకు నడుంకట్టారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి పరిశ్రమల అవసరాలు, సామాజిక అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేసేందుకు వేగవంతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్ఐర్ఐఎఫ్ ర్యాంకింగ్ మెరుగుదలకు కృషి.. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగుదలకు వ్యూహాత్మక ఫ్రేమ్‌వర్క్, మెంటర్‌షిప్ కమిటీలు ఏర్పాటుచేశారు. సమగ్ర పరీక్షల నిర్వహణ వ్యవస్థ ద్వారా పరీక్ష ప్రక్రియల ఆటోమేషన్ కోసం దశలవారీ ప్రణాళిక రూపొందించారు. మెరుగైన యూనివర్సిటీ మేనేజ్ మెంట్ సిస్టమ్ అమలుకోసం ఢిల్లీ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతోపాటు ఈ-సమర్థ్ వ్యవస్థ ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పురోగతిలో ఉంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ

- 8లో

ప్రేమ, దయాగుణం క్రీస్తు బోధనలు. వాటిని ప్రతీ ఒక్కరూ ఆచరించాలి

● మంత్రి కోలుసు పార్థసారథి

విజయవాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి ఇంటిలోనూ సంతోషాలు నింపాలని క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, త్యాగానికి ప్రతీకైన యేసుక్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమన్నారు. ప్రేమ, శాంతి, దయాగుణాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి 'యేసుక్రీస్తు' అని ప్రతీ ఒక్కరూ ప్రేమ, దయాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలని క్రీస్తు ప్రజలకు బోధించడమే కాక, జీవించి చూపించారన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

24 గంటల్లోపే రైతు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ

● దిగ్విజయంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ● నాదెండ్ల మనోహర్, ఆహారం, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖల మంత్రి

అమరావతి, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటే జరిగే మోసా లను సులువుగా అరికట్టవచ్చని ఆహారం, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.. తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కు చట్టంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులతోపాటు సౌకర్యాలు గురించి, అవగాహన తీసుకురావలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ చట్టంలో ప్రతి ఏడాది అనేక మార్పులు తీసుకుంటున్నామన్నారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఈ చట్టం పై ప్రజల్లో అవగాహన లేదన్నారు. వినియోగదారులకు ఈ చట్టం పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. ఈ ఏడాది వినియోగదారుల న్యాయపాలనకు వర్చు వల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యం ఇతి వృత్తంగా తీసుకు న్నారన్నారు. గ్రామ స్థాయి నుండి పట్టణాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో ఏదైనా వస్తువులు తయారు చేసినప్పుడు ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకునేవాళ్ళున్నారు. ఇప్పుడు అ పరిస్థితి లేదని, వినియోగదారుల చట్టాలను ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఇది ప్రతి ఒక్క వినియోగదారులు ఉపయోగించుకోవాల న్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామ న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఇబ్బందుల ను గుర్తించి వాట్సాప్ ద్వారా రైతుల వద్ద నుండి 22,80,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి వారికి 48 గంటల్లో నగదు వారి ఖాతాల్లో జమ అయ్యే విధంగా ఏర్పాటు చేశామన్నారు. కాని అనుకున్న దానికన్నా ముందుగానే రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే రూ. 5,300 కోట్లు జమ చేసామన్నారు. అదేవిధంగా దీపం-2 పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ పంపిణీ చేసినప్పుడు అనేక ఇబ్బందులు ఉన్నా, వినియోగదారులకు అనుకున్న సమయానికే 75,00,000 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గతం లో చిన్న చిన్న షాప్స్ లో మనకి ఎక్స్చేంజ్ ఆఫర్ ఉండేది కానీ అలా ఇప్పుడు లేదన్నారు. ప్రతి పౌరుడికి రక్షణ తో పాటు గౌరవం కూడా ఇవ్వాలన్నారు.. మన ప్రధాన హక్కులు మనం ఇపుడు మర్చిపోతున్నామన్నారు. ఈ చట్టం గురించి మనం లోతు గా ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలన్నారు. మహిళలకు చట్టంపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నుండి వినియోగదారుల పరిరక్షణకు చట్టం తీసుకురావడం గొప్ప కాదని, చట్టాన్ని క్షేత్రం స్థాయి-ులో ప్రజల ముందుకు తీసుకువెళ్ళినపుడే దానికి న్యాయం జరుగుతుందన్నారు. చట్టాన్ని గ్రామ, మండల, రాష్ట్ర స్థాయిలో అవగాహన కల్పించంచడమే కాకుండా కమిటీలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారస్తులు సేల్స్ పెంచుకోవ డానికి తప్పుడు ప్రచారం చేస్తారని, అలాంటి వాటిని కట్టడిచేయా లంటే చట్టం పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాల్లో ఫుడ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసే విధంగా ముఖ్యమంత్రి తో చర్చించి ఏర్పాటుకు చర్యలు

- 7లో

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకి తెలియజేయునది ఏమనగా... Shaik Hussain గారు రిజిస్టర్ విక్రయ దస్తావేజు No: 10379/2023 తేదీ 17/10/2022 ద్వారా కృష్ణా డిస్ట్రిక్ట్ , మచిలీపట్నం ,వర్రే గూడెం , మునిసిపల్ వార్డ్ 3, పాత డోర్ No- 3/242 మరియు న్యూ డోర్ No-3/240-1, రీ సర్వే నెంబర్ - 337 రు లోచ. గ. 169.19 ల స్థలంలో ని ఖాళీ నీవేశనస్థలం సంక్రమించినది .కావున Shaik Hussain గారు అట్టి ఆస్తిని Repco home finance ltd సంస్థలో హోమ్ లోన్ కోసం దరఖాస్తు చేసుకొని ఉన్నారు .కావున అట్టి ఆస్తిపై ఏవరికైననుఏ విధమైన అభ్యతరములు ఉన్నా లేక కోర్ట్ తగాదాలు ఉన్నా అట్టి వారు ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపు చట్టపరమైన దస్తావేజులతో మా ఆఫీస్ కి వచ్చి లిఖితపూర్వకంగా అభ్యర్థనలను సకాలములో తెలపగలరు. సకాలంలో అభ్యర్థనలు రానిచో అట్టి ఆస్తిని షేక్ హుస్సేన్ గార్కి సక్రమమైన పద్ధతిలో తనకి సంక్రమించింది అని నమ్మి Repco మచిలీపట్నం బ్రాంచి వారి యొక్క నియమ నిబంధనల ప్రకారం షేక్ హుస్సేన్ గారి ఆస్తిని మరియు దస్తావేజుని కుదవ పెట్టుకొని అప్పు మంజూరు చేయుటకు నిర్ణయం తీసుకోగలరు. Repco home finance ltd, Machilipatanam Branch with permission.

Pothula murali krishna
Advocate
D.No.19/465,Sarcaru vaari thota,
మచిలీపట్నం, సెల్. 9392912347

రోడ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి

● అధికారులకు మంత్రి సుభాష్ ఆదేశాలు

రామచంద్రపురం,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : రామచంద్రపురం నియోజవర్గంలోని రోడ్ల నిర్మాణాలు వచ్చే సంక్రాంతిలోగా పూర్తి చేయాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులును ఆదేశించారు. రామచంద్రపురంలో మంత్రి సుభాష్ పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారులతో రోడ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శిథిలావస్థలో ఉన్న రోడ్డతో పాటు,కొత్త రోడ్లు నిర్మాణం వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి అయ్యేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇప్పటికే పురోగతిలో ఉన్న రోడ్లు, నూతన ప్రతిపాదనలు వెరసి కోట్లాది రూపాయలు హెచ్చించినట్టు తెలిపారు. ఆర్ అండ్ బి పరిధిలో రూ.7.86 కోట్లతో 87 కిలోమీటర్ల మేర 23 పనులు జరుగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఇవి కాకుండా రూ.3.5 కోట్లతో తిప్పరాజుపాలెం నుంచి కాజులూరు రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.అలాగే కాజులూరు మండలంలో 27 పనులకు సంబంధించి 9 పనులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.30.5 కోట్లతో 35.95 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరయ్యేలా చర్యలు గైకొనాలని మంత్రి సుభాష్ ను కోరారు.అలాగే పల్లె పండుగ కార్యక్రమంలో రూ.3.34 కోట్లతో 5.92 కిలోమీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, 0.53 కిలోమీటర్ల మేర డ్రైన్స్ నిర్మాణం కోసం పనులు చేపట్టామని, వీటిలో 9 పనులు పూర్తయినట్లు తెలిపారు. అలాగే రామచంద్రపురంలో రూ.3.9 కోట్లతో 7.6 కిలోమీటర్లు పనులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.గంగవరం మండలంలో రూ.1.17 కోట్లతో 24 పనులు 2.69 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నాయని వివరించారు. ఇవి కాకుండా రామచంద్రపురం, గంగవరం మండలంలో రూ. 7.2 కోట్లతో 67 పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే పనులన్నీ పూర్తవుతాయని మంత్రి సుభాష్ కు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఈ ఈ సత్య శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ ఎఎస్ఎన్ బాబు, డి ఈ ఈ సూర్యనారాయణ,జెఈ లు భవాని శంకర్, వెంకటేశ్వరరావు,ఆర్ అండ్ బి డిఈ కామేశ్వరరావు,జెఈ లు ప్రసన్న, రమణ, తదితరులు పాల్గొన్నారు.

భాజపా బూత్ కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం

రౌతులపూడి,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో ఆయా గ్రామ బిజెపి బూత్ కమిటీ సభ్యులను,వారి అనుభూతులను భాజపా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్ కమిటీ సభ్యులను బూత్ కమిటీ పై ఆయన ఆరా తీశారు. అనంతరం ములగపూడి గ్రామంలో పార్టీ కార్యకర్త అయిన కొరుప్రోలు ఏసుబాబు ఆయన మనుమరాలు పుట్టినరోజు వేడుకలకు హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బిజెపి మండల అధ్యక్షులు వటా శ్రీను సీనియర్ నాయకులు లవుడు శ్రీను, కన్నబాబు, పి.శ్రీను జమీలు,యనమల రాజా రాజేంద్ర, మాణిక్యం, బిజెపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చెరుకుమిల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

కృత్తివెన్ను,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు వివిధ పంచాయతీలలో నిర్వహించి అధిక సంఖ్యలో నమోదు చేసిన సంగతి తెలిసినదే! ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఒడుగు తులసిరావు సారథ్యంలో మంగళవారం నాడు కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి పంచాయతీలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తులసిరావు తో పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు పట్టపు నాగుల మీరా కూనసాని చిన్న పట్టపు కృష్ణమూర్తి పట్టపు విజయరామచంద్రరావు పట్టపు రాధాకృష్ణ పట్టపు రాంబాబు బెజవాడ రామకృష్ణ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : ఈవీఎంల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా గొల్లపూడి మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచే గోదామును మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ టీవీ కెమెరాల వ్యవస్థను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్ట పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీలో డిఆర్వో ఎం. లక్ష్మీ నరసింహం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాకినాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : జగన్నాధపురం రవీంద్ర భారతి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఫౌండర్ ఎంఎస్ మణి మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదినంను క్రిస్మస్ పండుగగా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని. జీసస్ జన్మించి నేటికి 2000 సంవత్సరాలు దాటిందని కరుణామయుడు, దయామయుడు అని ప్రపంచంలోని క్రైస్తవులు ఆరాధనలను అందుకుంటాడని జీసస్ చూపిన అహింస ప్రేమ మార్గాలలో అనుసరించాలని ఆమె అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జోసెఫ్ క్రిస్మస్ సందేశం అందించారు ఉత్తమ చంద్ మాట్లాడుతూ యేసు క్రీస్తు జనన పిల్లలకు వివరించారు లోక రక్షకుడుగా ఏసుక్రీస్తు ఎందుకు ఈ లోకానికి వచ్చారు తెలిపారు ప్రిన్సిపల్ కె అరుణ్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో జరిగే వాటి నుండి మంచిని తీసుకుని చెడును విడిచిపెట్టాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏజీఎం బి వెంకట లింగేశ్వరరావు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్న ఈ వేడుకల్లో చిన్నారులు శాంతా క్లాస్ మేరీ జోసెఫ్, దేవదూత వేషధారణలు ఎంతో ఆకట్టుకున్నాయి.

అలేఖ్య ఇన్ఫ్రా డెవలపర్స్ వారి ఐదవ వార్షికోత్సవ సందర్భంగా ప్రతిష్టాత్మకమైన అమృత కౌంటరి క్లబ్ హౌస్ భూమి పూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అలేఖ్య డెవలపర్స్ చైర్మన్ నంద్యాల ప్రభాకర్ యాదవ్, ఎండి ఆళ్ల వెంకటేశ్వరరావు, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్ రమణారెడ్డి, అడ్వైజర్ కే వెంకటరమణ మరియు అనిల్ కుమార్ జైన్ తదితరులు

-హైదరాబాద్,డిసెంబర్ 24 (వార్తాప్రభ) :

క్రిస్మస్ కు ముస్తాబైన చర్చి లు

మైలవరం,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : క్రిస్మస్ సంబరాలకు మైలవరం పట్టణంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి.ఆయా ప్రాంతాల్లోని చర్చిలను క్రైస్తవులు విద్యుత్ దీపాలతో అలంకరించారు.ప్రధానంగా మైలవరం శాంతినగర్ లో ని ఆర్సియం (RCM) చర్చి లో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం జరిగే ప్రత్యేక పార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు.మైలవరం కతోలిక విచారణ గురువు రెవ.ఫా.కె. అనీల్ ఫ్రాన్సిస్ చర్చి లో జరుగుతున్న ఏర్పాటులను పర్యవేక్షించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్

● కూటమి ప్రభుత్వంలో క్రిస్మస్ ను క్రైస్తవులు సంతోషంగా జరుపుకుంటున్నారు

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏసుక్రీస్తు దీవెనలు ఉండాలి

గన్నవరం,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గన్నవరం నియోజకవర్గ ప్రజలకు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రేమాభావం, సేవాతత్పరతను క్షమాగుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినమై క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఏసుప్రభువు చూపిన మార్గం శాంతి, సహనం,ప్రేమ మార్గాలలో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. ఈ క్రిస్మస్ పండగ మీ జీవితాల్లో కొత్త పుంతలు తొక్కాలని అన్నారు. ఏసుప్రభువు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అన్నారు. క్రీస్తు దీవెనలు అందరికీ చేకురాలని.. ప్రతిఒక్కరూ ఆనందంగా జీవించాలని ఆ ప్రభువును వేడుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏసుక్రీస్తు దీవెనలు ఎప్పుడు ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిం

ఏడిబి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

కాకినాడ, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : రాజమహేంద్రవరం నుండి పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ పోర్టు వరకు చేపడుతున్న ఏడిబి రోడ్డు విస్తరణ పనులను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే రహదారి విస్తరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నిరంతర పర్యవేక్షణతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను గాలికి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

కాకినాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రి క్రిస్మస్ వేడుకలు బట్టలు, స్వీట్లు పంపిణీ

కాకినాడ, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కాకినాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్థానిక రామారావు పేటలో ఉన్న ప్రెస్ క్లబ్లో ఈ వేడుకలకు కాకినాడ ప్రెస్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. క్రిస్మస్ కేకును ముఖ్యఅతిథి పాస్టర్ ఎన్ జోసఫ్ శామ్యూల్ కట్ చేసి అక్కడ ఉన్నవారికి అందించారు. ఈ సందర్భంగా పాస్టర్ జోసఫ్ శామ్యూల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది తాము పలువురికి క్రిస్మస్ సందర్భంగా బట్టలు, కేకులలను తమ సంస్థ ద్వారా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈసారి వారితో పాటు కాకినాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. బైబిల్లో గాబ్రియేల్ అనే దేవదూత సమాచారాన్ని అందజేస్తుందని ఆ విధంగా ప్రస్తుత కాలంలో ప్రజలకు ఆ తరహాలో అవసరమైన సమాచారాన్ని అందించి వారికి సహాయపడటంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఉంటుందని శ్యామ్యూల్ పేర్కొన్నారు.ఇటువంటి సేవా కార్యక్రమాల్లో తనకు భాగస్వామ్యం కల్పించడం పట్ల జోసఫ్ శామ్యూల్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా బట్టలు, స్వీట్స్, కేకులను బహుకరించారు. అనంతరం ఆయన్ని ఘనంగా సత్కరించారు. అలాగే రానున్న సంక్రాంతి, రంజాన్ పండగలకు సంబంధించిన వేడుకలను కూడా నిర్వహించి ప్రెస్ క్లబ్ లో సర్వ మతాలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు చేపడతామని ప్రెస్ క్లబ్ కార్యవర్గం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పిఎ రామారావు, జి శోభన్ బాబు,కోశాధికారి కే శ్రీనివాసరావు వివిధ పత్రికలు,చానళ్ళకు చెందిన జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుగ్గుదూరు, ఉప్పుమిల్లి రైతులకు నీటి కొరత లేకుండా చూస్తాం

● రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

● రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండల పరిధిలోని దుగ్గుదూరు, ఉప్పుమిల్లి గ్రామాల రైతులకు సాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.మంత్రి సుభాష్ ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులతో కలిసి పలు పంట కాలువలు,డ్రైన్ లను పరిశీలించారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతులకు ఎలాంటి నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దుగ్గుదూరు ఛానల్, కుయ్యేరు ఈస్టు సైడ్ ఉన్న మూడువేల ఎకరాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీటి కొరత వస్తున్న నేపథ్యంలో సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి సుభాష్ సూచించారు.అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపీఎస్ ఐడిసి) అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.రబీ సీజన్లో మినహా ఖరీఫ్ సీజన్లో సాగునీటికి ఎలాంటి కొరత లేదని మంత్రి సుభాష్ కు ఇరిగేషన్ అధికారులు వివరించారు.మంత్రి సుభాష్ వెంట ఇరిగేషన్ ఈఈ వి.వి.రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.రమేష్ బాబు,ఏఈ విన్నకోటి సుజాత,కూటమి నాయకులు,పలువురు రైతులు పాల్గొన్నారు.

బల్లిపర్రు లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెడన,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ జోగి నాగ వరలక్ష్మి వెంకటరమణ ప్రారంభించారు. శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్ ఆర్ జె ఈ ఎస్)ద్వారా 29 లక్షల రూపాయలు ఈ రోడ్డు నిర్మాణానికి అధికారులు మంజూరు చేసారు. పంచాయతీరాజ్ ఏఈ ధర్మయ్య ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.నాణ్యత ప్రమాణాలతో పనులను చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసన వీరబాబు కూడా పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాకినాడ రూరల్,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వివిఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను కాకినాడ రూరల్ మండల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ ను కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు హ్యాపీ క్రిస్మస్ ...మేరీ క్రిస్మస్ అంటూ వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వివిఎస్ ప్రకాశరావు, సభ్యుడు వల్లూరి నానాజీలు మాట్లాడుతూ 2024 సంవత్సరాల క్రితం పుట్టిన క్రీస్తుని అప్పటినుంచి క్రీస్తు పుట్టిన రోజును పురస్కరించుకుని క్రిస్మస్ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.నియోజవర్గ అభివృద్ధి ప్రదాత పంతం నానాజీ, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు సాన సతీష్ బాబులు కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్నారని అదేవిధంగా ప్రజా నాయకులకు,ప్రజా ప్రతినిధులకు అధికారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు అర్జున్ భాస్కర్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మణరావు జాయింట్ సెక్రెటరీ రవికుమార్,సుధీర్, ఎల్ ఎస్. వీరభద్రరాజు,సుబ్బు, సుబ్రహ్మణ్యం,ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల నుండి బాధితులకు 70 కోట్లు రిఫండ్ చేయించాం.

-యాన్యువల్ రిపోర్ట్ లో సిపి అవినాష్ మహంతి

శేరిలింగంపల్లి,డిసెంబర్ 24 (వార్తాప్రభ): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మంగళవారం మీడియా సమావేశంలో అనువల్ రిపోర్ట్ 2024 సంవత్సరంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ శాతం పెరిగిందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు.ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ..37689

కేసులను ఈ ఏడాది రిజిస్టర్ చేశామని తెలిపారు.మొత్తం రిజిస్టర్ అయిన కేసుల్లో 32 శాతం సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు.70 కోట్ల రూపాయలు సైబర్ నేరగాళ్ల నుంచి బాధితులకు రిఫండ్ చేసి ఇచ్చామని సీపీ మహంతి అన్నారు. ఎకనామిక్ అఫెన్స్ కోసం పీఎస్ ఏర్పాటు చేశాం అందులో కేసులు నమోదయ్యాయని,ఎకనామిక్ అఫెన్సెస్ మరింతగా పెరిగే అవకాశం ఉంది..ఎకనామిక్ అఫెన్స్ పీఎస్ ను మరింతగా విస్తరిస్తామన్నారు సీపీ అవినాష్ మహంతి. నార్కోటిక్స్ కట్టడికి పని చేస్తున్నాం..డ్రగ్స్ కేసులు అనేకంగా నమోదయ్యాయి

అదేవిధంగా అరెస్టులు కూడా జరిగాయని,ట్రాఫిక్ విషయంలో పబ్లిక్ ను ఇబ్బంది పెట్టేవి..రోడ్ ప్రమాదాలకు కారణం అయ్యే అంశాలపై దృష్టి పెట్టామన్నారు.ఐటీ ఏరియాలో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమిస్తున్నాం..రోడ్ వైడనింగ్ చేయడం వల్ల ఇబ్బందులు తప్పుతున్నాయన్నారు.సైబరాబాద్ ఏరియాలో అనేక ల్యాండ్ ఇష్యూస్ ఉంటాయి.. ఎక్కడ క్రైమ్ రిలేటెడ్ ఇష్యూ ఉంటే అక్కడ కేసు నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు.అంతేకాకుండా.. 1.50 లక్షల రూపాయల లోపు సైబర్ క్రైమ్ ఉంటే లోకల్ పీఎస్ లోనే ఇన్వెస్టిగేట్ చేస్తారని,జనవరి 1 నుంచి ఇది ప్రారంభం అవుతుందన్నారు.ఇప్పటి వరకు బి.ఎన్.ఎస్ లాస్ కింద 14 వేల కే సులు నమోదు చేశామని,వచ్చే ఏడాది మరింతగా క్రైమ్ తగ్గించడానికి పని చేస్తామన్నారు.జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ కేసులో ఇన్వెస్టిగేషన్ కొనసాగుతుందని,జన్వాడ కేసులో బ్లడ్ శాంపిల్ ఎఫ్.ఎల్.ఎన్ కు పంపించామన్నారు.ఈవెంట్స్ పర్మిషన్ కోసం పర్మిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ తీసుకొచ్చామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు.

ముసుగు దట్టమైన ఆటవి ప్రాంతంలో రూపుదిద్దుతున్న బ్లాక్ బెర్రీ దీవి

ములుగు,డిసెంబర్:24 (వార్తాప్రభ): దట్టమైన ఆటవి ప్రాంతాంలో కుటుంబ సమేతంగా సంతోషంగా గడపాడానికి కోత్తగా రూపుదిద్దుతున్న బ్లాక్ బెర్రీ దీవి, ప్రకృతి అందాల నడుమ స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకుని ఆయుష్షును పెంచుకోండి అంటున్న మంత్రి సీతక్క,ములుగు జిల్లా తాడ్వాయి మండలం లోనీ మొండ్యాల తొగు సమీపంలోనీ బ్లాక్ బెర్రీ దీవిని రాష్ట్ర పంచాయితి రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సందర్శించారు. జాతీయ రహదారి సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో బ్లాక్ బెర్రీ దీవిని కోటి రూపాయాలతో అటవి శాఖ అదికారులు పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. ఇసుకలో అటవి ఉత్పత్తులు ఉపయోగించి సోలార్ సహయంతో విధ్యుత్ దీపాల ఆలంకరణ పర్యాటకులను ఆకర్షంచే విదంగా రూపుదిద్దుతున్నారు. వెదురు బోంగులతో స్వాగత తోరణం మరియు దీపాల ఆలంకరణ చూపరులకు ఆకర్షిస్తూంది. ఈ పర్యాటకాన్ని ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లడుతూ అతి త్వరలో అందుబాటులోకి రానున్న బ్లాక్ బెర్రీ పర్యటక ప్రాంతంలో నిండు రాత్రి వెన్నెల వెలుగులలో దట్టమైన అడవి ప్రాంతంలో కుటుంబ సమేతంగా గడపాడాన్ని ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. పండు వెన్నెల వెలుతురులో స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ కుటుంబ సమేతంగా గడపడానికి అన్ని రకాల ఏర్పాట్లు అటవీ శాఖ అధికారులు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్న వాటికి దీటుగా బ్లాక్బెర్రీ ప్రాంతాన్ని అద్భుతంగా రూపు రుద్దుతున్నామని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర మంత్రులతో బ్లాక్ బెర్రీ దీవినీ ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామని సీతక్క తెలిపారు.

డివైడర్లపై ఉన్న కోన కార్పస్ చెట్లను తొలగించాలని
ప్రజా భవన్ లో వినతిపత్రం ఇచ్చిన అన్వార్ సునీల్ కుమార్

నారాయణపేట డిసెంబర్ 24(వార్తాప్రభ): జిల్లా కేంద్రం రోడ్డుపై ఉన్న డివైడర్లు కోనో కార్పస్ చెట్ల వల్ల క్యాన్సర్ కు కారకమని గతంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన అన్వార్ సునీల్ కుమార్ కుమార్ తరువాత చెట్లను పూర్తిగా తొలగించకుండా కొమ్మలు మాత్రమే తీసివేయడంతో ఈరోజు హైదరాబాదులోని ప్రజాభవన్ లో చెట్లను పూర్తిగా తీసివేయాలని వినతి పత్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్వార్ సునీల్ కుమార్

త్యాగం, దయ, శాంతి మార్గకులు ఏసుక్రీస్తు!!

- చాలా ప్రత్యేకమైన పండగ క్రిస్మస్
- సర్వ మతాలు విశ్వశాంతినే బోధిస్తాయి
- క్రైస్తవుల సంక్షేమానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 24 (వార్తాప్రభ ప్రతినిధి) త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు కలిగిన మార్గకులు ఏసుక్రీస్తు అని, ప్రభువులాగే ప్రజలు సైతం ఇతరుల పట్ల శాంతి, దయ, త్యాగం కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ అని, క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఈమెరకు మంగళవారం గోదావరిఖనిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో రామగుండం తహశిల్దార్ కుమారస్వామి అధ్యక్షతన ముందస్తు

క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... క్రైస్తవ సోదరులకు చాలా ప్రత్యేకమైన పండగ క్రిస్మస్ అని, క్రైస్తవుల సంక్షేమానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుంది అని హామీ ఇచ్చారు. సర్వ మతాలు విశ్వశాంతినే బోధిస్తాయి అని తెలిపారు.

అంబేద్కర్ ను అవహేళన చేస్తే సహించేది లేదు

- అమిత్ షా పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి) కొత్తగూడెం అంబేద్కర్ ను అవహేళన చేస్తే సహించేది లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు.అంబేద్కర్ పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ ఫోటోలతో నిరసన తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.బిజెపి మనువాద భావజాలం అమిత్ షా మాటల ద్వారా బయటపడిందని,అంబేద్కర్ పట్ల బిజెపి వైఖరిలో ఎలాంటి మార్పురాలేదని ఆక్షేపించారు.అంబేద్కర్ ను బిజెపి మాతృ సంస్థలు ఆర్ఎస్ఎస్,జనసంఘ్ లు వ్యతిరేకించాయని రాజ్యాంగాన్ని ఆమోదించే సమయంలో అంబేద్కర్ ను తప్పుపట్టాయని దుయ్యబట్టారు.అంబేద్కర్ భావజాలం దేశంలో బలంగా ఉండటం వల్లే బిజెపి తన సొంత ప్రణాళికలు అమలు చేయడానికి జంకుతోందని మనువాదులకు అంబేద్కర్ సహజంగానే నచ్చరని అమిత్ షా వ్యాఖ్యలు దాన్ని మరోసారి నిరూపించాయని విమర్శించారు.బిజెపి ఎప్పుడూ అంబేద్కర్ రాజ్యాంగానికి,ఆయన సిద్ధాంతాలకు వ్యతిరేకమని,మొత్తానికి బిజెపి ముసుగు తొలగిందని భారత రాజ్యాంగం ద్వారా రాష్ట్రపతి భాద్యతలు నిర్వహిస్తున్న రాష్ట్రపతి వెంటనే స్పందించి అమిత్ షా ను కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఎవరైనా అంబేద్కర్ ను కానీ భారత రాజ్యాంగాన్ని కానీ కించపరిచినట్లుగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ తడికల శివకుమార్,జిల్లా అధ్యక్షులు గంధం మల్లికార్జున రావు,శనగ వెంకటేశ్వర్లు,పాక వెంకటేశ్వర్లు,వినయ్,గుడివాడ రాజేందర్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత నడికూడ రఘునాథ్ యాదవ్ కు సన్మానం

షాద్ నగర్, డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి) సేవారత్న అవార్డు గ్రహీతను ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో వాసవి క్లాత్ స్టార్ లో నడికూడ రఘునాథ్ యాదవ్ ను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తోటి మిత్రులు మాట్లాడుతూ సమాజంలో ఎంతో కొంత మనం సంపాదించిన దాంట్లో సాయం చేయడంలోనే నిజమైన మానవత్వం కలిగి ఉంటుందని నడికుడ రఘునాథ్ యాదవ్ చేస్తున్న సమాజ సేవకు తోడ్పాటును అందిస్తామని, వారు వేసే ప్రతి అడుగులకు మా యొక్క సహాయ సహకారాలు కల్పిస్తామని, ఇంతటి గొప్ప సేవా పురస్కారాన్ని అందుకోవడం నిజంగా షాద్ నగర్ వాసులుగా మేము గర్వపడుతున్నామని అన్నారు. రఘునాథ్ యాదవ్ ముమ్ముందు బీద, మధ్యతరగతి కుటుంబాలకు సేవలందిస్తూ మరెన్నో అత్యున్నత పురస్కారాలు అందుకోవాలని కోరుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలమట్ల శివకుమార్, వాసు, ఎంసాని శ్రీనివాస్, నాగిల్ల భవాని ప్రసాద్, విశ్వనాథ్, పెద్ది రామ్మోహన్, గోపాల్ యాదవ్, ఇప్పలపల్లి రవి, తాటి విజయకుమార్, యుగంధర్, మల్చలం రాము, సురేష్, ఒళ్ళు మనోహర్ రెడ్డి మరియు ఇతరులు పాల్గొన్నారు.

దేశంలో 40 కోట్ల అసంఘటిత కార్మికులు

- వారికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు అయ్యేలాగా చూడాలి
- ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి రాజేశ్వరరావు

శేరిలింగంపల్లి,డిసెంబర్ 24 (వార్తాప్రభ): బి.ఎం.ఎస్ 70 సంవత్సరాల కార్మిక సంపర్క్ అభియాన్ లో భాగంగా మంగళవారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్ లో కార్మికులు ఉద్యోగులను కలిసి బి.ఎం.ఎస్ కరపత్రం ఇచ్చి బి.ఎం.ఎస్ 70 సంవత్సరాల ప్రస్థానం గురించి భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి.రాజేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో సుమారు 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారని వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని అదేవిధంగా జిహెచ్ఎంసి లో పనిచేసే ఉద్యోగ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని అదే విధంగా ఉద్యోగుల ప్రమోషన్ల విషయం వెంటనే అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. జిహెచ్ఎంసి ఉద్యోగ కార్మికుల హెల్త్ కార్డు రెన్యువల్ వెంటనే చేయాలని, ఇన్సూరెన్స్ అమౌంట్ 3 లక్షలు నుండి 10 లక్షలు పెంచాలని, జిహెచ్ఎంసి లో ఖాళీ స్థానాలలో రిక్రూమెంట్ ద్వారా ఉద్యోగులను భర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జూన్ అధ్యక్షులు ఇక్బాల్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ లో పనిచేసే కార్మికుల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కి తెలియజేశామని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు అన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన కె.యం. ప్రతాప్

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కుత్బుల్లాపూర్ 127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో స్కూల్ మేనేజ్మెంట్ వారు నిర్వహించిన, సెమీ క్రిస్మస్ వేడుకలకు, వారి యొక్క ఆహ్వానం మేరకు, ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ విచ్చేసి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రేమావతి,కరస్పాండెంట్ అశోక్, ఉపాధ్యాయురాళ్లు, పాఠశాల విద్యార్థులు, స్కూల్ మేనేజ్మెంట్ వారు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

కాకినాడలో షోటోకాన్ కిక్కులు, పంచులు అదుర్స్!!

- మాస్టర్ రాము శిక్షణలో జాతీయస్థాయిలో 10 పథకాలు
- "విన్నర్స్, రన్నర్స్"కి శుభాకాంక్షలు వెల్లువ

పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 24 (వార్తాప్రభ ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలలో విక్టరీ షోటోకాన్ కిక్కులు, పంచులు అదుర్స్ అని పది మెడల్స్ అందజేశారు నిర్వాహకులు. ఈనెల 22వ తేదీన జరిగిన పోటీలలో మాస్టర్ బోయపోతు రాము శిక్షణలో రాటు తేలిన అభిజయ, లక్ష్మీ శ్రీ హర్ష, హర్షవర్ధన్, సహస్ర, స్నేహిత్, సాత్విక, సుష్మ, కైఫ్, గౌతమ్, శ్రీ తేజ రెడ్డి విన్నర్స్, రన్నర్స్ గా నిలిచారు. పథకాలతో రామగుండం ప్రాంతంలో అడుగుపెట్టిన మార్షల్ ఆర్ట్స్ విజేతలకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని అభినందించి ఆశీర్వదించారు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ మల్లికార్జున్ గౌడ్, సీనియర్ కరాటే మాస్టర్ తగరపు శంకర్, కృష్ణ, ఒడ్డేపల్లి సురేష్.

సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన కాంగ్రెస్ నేత కుమార్ యాదవ్

కూకట్ పల్లి,డిసెంబర్ 24(వార్తాప్రభ): శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ 122 డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్, రోడ్ నెంబర్ 5, రోడ్ నెంబర్ 6 లో జరుగుతున్న సిసి రోడ్డు పనులను స్థానిక కాలనీవాసులతో కలిసి పరిశీలించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుమార్ యాదవ్. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ చాలా రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేశారు.అలాగే సీసీ రోడ్డును నాణ్యత క్యూరింగ్ చేసి వీలైనంత తొందరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాలనీవాసులు కుమార్ యాదవ్ ను అభినందించారు.ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పరమేష్ గౌడ్,ఎర్రన్న,కృష్ణ, మల్లేష్, శ్రీహరి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కేపీ విశాల్ గౌడ్

కుత్బుల్లాపూర్ డిసెంబర్ 24 (వార్తాప్రభ) : సెమీ క్రిస్మన్ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని సిపిఆర్ కాలనీలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఉండ్రు విల్సన్ ఏర్పాటుచేసిన క్రిస్మన్ కేక్ ను మంగళవారం యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి. విశాల్ గౌడ్ కట్ చేశారు.ఈ సందర్భంగా విశాల్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఏసుప్రభు దీవెనలు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పరిశుద్ధ సువార్త మందిరం కళావతి నగర్ చర్చి సభ్యులు పాస్టర్ శ్యాంబాబు, మైకేల్,సిహెచ్. రాజు,ఆనంద్, వినోద్, రాజు,మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

-టీ పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్.

జగిత్యాల డిసెంబర్ 24(వార్తాప్రభ) పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ప్రభుత్వంను కోరారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2025 క్యాలెండర్లను,డైరీలను ,పెన్షనర్స్ పిలుపు పుస్తకాలను హరి ఆశోక్ కుమార్ సభ్యులందరికీ అందజేశారు. అనంతరం హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందించాలని,మార్చి 2024 నుంచి రిటైర్మెంట్ అయిన వారికి రావాల్సిన జి.పి.ఎఫ్,గ్రాట్యుటీ,కమ్యూటేషన్,లీవ్ సారీ,తదితర ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని,వైద్య ఖర్చుల బిల్లులు సత్వరం చెల్లించాలని,పెన్షనర్స్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని,తదితర డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వంను కోరారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం,,సహాయ అధ్యక్షుడు పి.సి.హన్మంత రెడ్డి,ఉపాధ్యక్షులు వేల్ముల ప్రకాష్ రావు,ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల ఆశోక్ రావు,కే.సత్యనారాయణ మహిళా కార్యదర్శి కరుణ,సంయుక్త కార్యదర్శులు దిండిగాల కార్యదర్శి దుబ్బేశం, రాయికల్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు,తదితరులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

మూడేళ్ళ తరువాత విశాఖకు మోడీ!

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దాదాపు మూడేళ్ల తరువాత విశాఖ జిల్లాకు వస్తున్నారు. చాలా సార్లు ప్రధాని విశాఖ పర్యటన ఉన్నా కూడా అది అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఏడాది నవంబర్ లో ప్రధాని విశాఖ టూర్ దాదాపుగా ఖరారు అయి చివరి నిముషంలో క్యాన్సిల్ అయింది. వాతావరణం అనుకూలించక అందువల్లనే క్యాన్సిల్ అయింది అని అపుడు చెప్పారు. ఇక 2025 జనవరి 8న ప్రధాని ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన అనకాపల్లికి వస్తారు అని అంటున్నారు. అక్కడ స్థానికంగా అనేక కార్యక్రమాలను ప్రారంభిస్తారు అని చెబుతున్నారు. అంతే కాదు అనకాపల్లి లో ప్రధాని బహిరంగ సభను ఏర్పాటు చేశారు. అనకాపల్లి ఎంపీ బీజేపీకి చెందిన సీఎం రమేష్ ఉన్నారు. అందువల్ల ప్రధాని అనకాపల్లి లో పర్యటిస్తారు అని తెలుస్తోంది. అయితే ఆయన విశాఖ జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ఈ సందర్భంగా శ్రీకారం చుడతారు అని అంటున్నారు. ప్రధాని చేతుల మీదుగా రైల్వే జోన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన జరుగుతుంది అని అంటున్నారు. అదే విధంగా అనేక ఇతర కార్యక్రమాలు ఆయన ప్రారంభిస్తారు అని తెలుస్తోంది. అయితే ప్రధాని ఉమ్మడి విశాఖ జిల్లా టూర్ లో మరోమారు విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఇష్యూ చర్చకు వస్తోంది. ప్రధాని దీని మీద ఏమి చెబుతారు అన్నది అంతా ఆసక్తిగా చూస్తున్నారు. విశాఖ ఉక్కు విషయంలో కీలక నిర్ణయం తీసుకోవాలని దానిని ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని ఉక్కు కార్మికులు కోరుతున్నారు. ఇప్పటికి పదిహేను వందల రోజులుగా ఏకధాటీగా ఉక్కు ఉద్యోగులు కార్మికులు నిరవధిక దీక్షలు చేస్తున్నారు. ప్రజా సంఘాలు అన్నీ కలసి ఉత్తరాంధ్ర వేదికగా ఏర్పడి విశాఖ ఉక్కు విషయంలో పోరాటం చేస్తూ వస్తున్నాయి. లక్ష పోస్టు కార్డులను ప్రధానికి పంపించడం ద్వారా విశాఖ ఉక్కుని కాపాడుకోవాలని కూడా నిర్ణయించారు. అంతే కాదు జనవరి 27న విశాఖలో లక్ష మంది ప్రజానీకంతో భారీ బహిరంగ సభను విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో నిర్వహించాలని కూడా నిర్ణయించారు. ఈ క్రమంలో ప్రధాని రాక మీద అధికార ప్రకటన విడుదల కావడంలో ఉక్కు పోరాట కమిటీ నిర్వాహకులు తన కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. ఏది ఏమైనా విశాఖకు ప్రధాని వస్తున్నారు. అదీ కూడా మూడవసారి ఆయన ప్రధాని అయ్యాక రావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాజకీయంగా కూడా ఇది చర్చనీయాంశం అవుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ ఉమ్మడి విశాఖ జిల్లాకు ఇవ్వబోయే వరాలు గురించి కూడా అంతా చర్చించుకుంటున్నారు. అదే విధంగా ఉత్తరాంధ్రాకు విభజన చట్టంలో ఇచ్చిన హామీల మీద ప్రధాని ఏమి చెప్పబోతున్నారు అన్నది కూడా ఆసక్తిగా ఉంది. మొత్తానికి మోడీ టూర్ ఎట్టకేలకు అధికారికంగా ఫిక్స్ అయింది. దాంతో అంతా ఆయన రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

వాహనదారులు జర జాగ్రత్త ఆదమరిస్తే అంతే

శునకములతో పలువురికి గాయాలు- గ్రామ ప్రజల ఆవేదన

చేజర్ల డిసెంబరు 24 (వార్తాప్రభ) మండలంలోని మాముడూరు గ్రామపంచాయతీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సంఘం చేజర్ల ప్రధాన రహదారిలో వెళ్లే వాహనదారులకు అడ్డువడి నానా హంగామా సృష్టిస్తూ వాహనదారులను భయభ్రాంతులను గురిచేస్తూ నోటితో కరుస్తూ గాయాల పాలు చేస్తున్నాయి. అటుగా వెళ్లాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.ఇది అంతా మాముడూరు గ్రామ పంచాయతీలోని దుకాణదారులు వేస్ట్ పదార్థాలు రోడ్ల పైన వేయడంతో అవి తినడానికి ఎక్కువ మొత్తంలో కుక్కలు అక్కడికి చేరి దారిన వెళ్లే ప్రయాణికులను మరియు మాముడూరు గ్రామ ప్రజలను కరుస్తూ గాయాలు పరుస్తున్నాయి.సదరు పంచాయతీ కార్యదర్శి స్పందించి మాముడూరు రహదారులలో ఉన్న దుకాణదారులతో మాట్లాడి వేస్ట్ పదార్థాలను రోడ్ల పైన వేయకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.అలాగే గ్రామంలో విపరీతంగా కుక్కలు ఉండటంతో సంబంధిత వారికి తెలియజేసి కుక్కలను ఎక్కడ నుంచి తరలించేందుకు ప్రయత్నం చేయాలని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



"క్రిస్మస్" పర్వదినము

"యేసుప్రభు" జన్మదినము
ఈ "క్రిస్మస్" పర్వదినము
క్రైస్తవ సోదరులకు
ఎనలేని ఆనందము
కన్య మరియ గర్భాన
పాప పంకిల లోకాన
బాలయేసు జన్మ వేళ
అందరికి ఆనందహేల
క్రీస్తు పుట్టిన రోజున
క్రిస్మస్ తార వెలసెను
శిశువు యేసు చెంతకు
జ్ఞానులను నడిపించెను
అవతార మూర్తి యేసు

ఆదర్శ మూర్తి యేసు
క్రీస్తు యేసు జీవితము
చూడ పరమ పావనము
యేసు జన్మదిన శుభములు
అక్షర శుభాకాంక్షలు
క్రైస్తవ సోదరులందరికి
చిరు నవ్వుల బాలయేసుకు

గద్వాల సోమన్న

హెల్మెట్ వాడండి మీ కుటుంభాలని సంతోషంగా వుండనీయండి

■ వెస్ట్ జోన్ ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ

విజయవాడ వశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)ప్రతిఒక్కరు తప్పనిసరి గా హెల్మెట్ వాడాలని దానివల్ల మీరూ మీ కుటుంబ సభ్యులు సంతోషంగా ఉంటారని విజయవాడ నగర వెస్ట్ జోన్ ఏ డి సి పి గుణ్ణం రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానా విధిస్తూ వాహన చోదకులకు హితబోధ తో కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయం మోడల్ గెస్ట్ హౌస్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు చోదకుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుంటే వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు. అలాగే వారికి హెల్మెట్ లేకుంటే వాహనాలు నడిపితే జరిగే ఇబ్బందులు వివరించారు. అందరూ విధిగా హెల్మెట్ వాడాలని హితవు పలికారు. దారెంట వస్తున్న ద్విచక్ర వాహనాలు పై వస్తున్న వారిని ఆపి వారికి నో హెల్మెట్ చలానాలు విధించి తదుపరి వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో వెస్ట్ జోన్ ఏ డి సి పి రామక్రిష్ణ , వెస్ట్ డివిజన్ ఏ సి పి దుర్గారావు , వాన్ టౌన్ సిఐ శ్రీ గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎదిగే కొద్ది ఒదిగి.....సేమీ క్రిస్మస్ వేడుకల్లో ఆప్యాయంగా పిల్లలకు కేక్ తినిపించిన ఎమ్మెల్యే

◆ ప్రజలకు మరింత చేరువగా ఎంఎల్ఏ వసంత

ఇబ్రహీంపట్నం డిసెంబర్ 24(వార్తా ప్రభ ప్రతినిధి):- ఎదిగే కొద్ది ఒదిగి ఉండాలనే నానుడి ఎమ్మెల్యే వసంతను చూస్తే అక్షరాల నిజమౌతుంది. రెండవసారి గెలిచిన గర్వం లేదు.ఎమ్మెల్యే అనే అహంకారం అసలు లేదు..ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ..ప్రతి ఒక్కరి సంతోషంలో భాగస్వామ్యం అవుతూ... వైలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకు సాగిపోతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ రాజకీయ ప్రయాణం.కార్యక్రమం చిన్నదైనా పెద్దదైన ఆయన రావాలని కోరుకుంటున్న మైలవరం నియోజకవర్గ ప్రజల మనోభావాన్ని గౌరవిస్తూ ఎంతటి బిజీ షెడ్యూల్లో అయినా కూడా ప్రజల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తూ.... ఇటు నాయకులకు-అటు అధికారులకు సమయాన్ని కేటాయిస్తూ బాధ్యత వ్యవహరిస్తున్నారు.దీంతో మైలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వసంత పట్ల ఆదరణ విశేషంగా పెరుగుతుంది. ఆయనను సొంతం చేసుకుంటూ ప్రజలు ఆప్యాయత ఆదరణ కనబరుస్తున్నారు.

సేమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న అక్కల గాంధీ

దివ్యాంగులకు అన్నదానం

ఇబ్రహీంపట్నం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి):ఇబ్రహీంపట్నం లోని వున్న ప్రేమనికేతన్ పాఠశాలలో దివ్యాంగుల మధ్య సేమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా జనసేన పార్టీ అధికార ప్రతినిధి మరియు మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల రావ్మోహన్ రావు(గాంధీ) హాజరయ్యా.గుడ్ సమరిటన్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులైన చిట్టేలు కోటేశ్వరరావు - చిట్టేలు హరీష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి దివ్యాంగ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటివారిపట్ల ప్రేమ, దయహృదయం కలిగివుండాలని, నీవలె నీ తోటి వారిని ప్రేమించాలి అనే నినాదంతో ప్రతి ఒక్క సేవ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గండేపూడి పురుషోత్తం, లక్కోజు విశ్వనాథ్, పొంగునేటి వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు చిట్టేలు శ్రీనివాసరావు, యర్రంశెట్టి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ లో ముగ్గురికి పదవులు

విజయవాడ వశ్చిమ డిసెంబర్ 24:(వార్తా ప్రభ ప్రతినిధి)అల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ లో ముగ్గురుకి పదవులు దక్కాయి. నగర అధ్యక్షులు పెదప్రోలు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీమతి విస్సాకోటి కామేశ్వరి కి నగర మహిళా అధ్యక్షురాలుగా బాధ్యతలు ఇస్తూ... బ్రహ్మశ్రీ కానూరు గోపి నూకరాజు కి సిటీ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు ఇస్తూ... తమరి వెంకట రమేష్ బాబు ని నగర కమిటీ కోశాధికారిగా నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. ఈ నియామక పత్రాలను నగర అధ్యక్షులు పెదప్రోలు బాల సుబ్రహ్మణ్యం చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నూతనంగా పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఒక ప్రకటనలో తెలియజేశారు. కమిటీలో కొత్తవారికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తో పాటుగా విశ్వబ్రాహ్మణ సంఘీయులు కొత్తవారికి పూర్తిగా సహకారాన్ని అందించాలని సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు.

పెంచిన కరెంటు చార్జీల పెంపును, స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలనినిరసన

విజయవాడ వశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)భారీగా పెంచిన కరెంటు చార్జీలను రద్దుచేసి,స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని ఐద్వా పశ్చిమ నగర కార్యదర్శి,మాజీ కార్పొరేటర్ శ్రీమతి గాదె ఆదిలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వన్ టౌన్ 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు క్వారీలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి నాయకులు కరెంటు చార్జీలు పెంచమని,స్మార్ట్ మీటర్ల బిగింపుని అడ్డుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.కానీ గెలిచిన తర్వాత రెట్టింపు కరెంటు బిల్లులు పెంచి ప్రజల పైన భారాన్ని పెంచారు.అదాని స్మార్ట్ మీటర్ల బిగింపుకు సిద్ధమై కమర్షియల్ ప్రాంతాల్లో మీటర్లను బిగిస్తూ మరింత కరెంటు చార్జీలు పెంచే ప్రభుత్వ విధానాన్ని తప్పుపట్టారు.ప్రతి ఒక్క ఇంటికి వాడిన కరెంటు కట్టే చార్జీ కన్నా రకరకాల పేరుతో వడ్డించిన చార్జీలు ఎక్కువయ్యాయని,ఈ పద్ధతితో కార్పొరేట్ కంపెనీలకు లాభాల చేకూర్చటాన్ని వ్యతిరేకించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని,ప్రజల పక్షాన ఆలోచించి రెట్టింపు పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని,స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని,అదానితో కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇవి నారాయణ మరియు స్థానిక ప్రజలు హాజరైయ్యారు.

ఏసుక్రీస్తు సన్మార్గం మార్గం మానవాళికి ఆదర్శనీయం

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జంపాల సీతారామయ్య

ఇబ్రహీంపట్నం డిసెంబర్ 24(వార్తా ప్రభ ప్రతినిధి):- మండల పరిధిలోని మూలపాడు గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పాల్గొన్నారు. క్రిస్టమస్ కేక్ ను కట్ చేసి క్రైస్తవ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,మత వర్ణ విభేదం లేకుండా సేవా భావంతో మెలగడమే క్రైస్తవమని, ఏసుక్రీస్తు సూచించను సన్మార్గం మానవాళి అంతటికి ఆదర్శనీయం అని అన్నారు.ప్రతి ఒక్కరు సేవా భావంతో సాటివారికి సాయం చేయాలని, మహనీయుడు మానవునిగా సంచరించిన చరిత్ర క్రీస్తుదని, క్రీస్తు చరిత్రలో నిలిచి పోయిన విషయం గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాను, గ్రామ టీడీపీ అధ్యక్షుడు నాగరాజు, గురిజాల సాంబశివరావు(చిన్ని), గరికిపాటి శ్రీను,గరికిపాటి శివ, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

సర్వ మానవాళి ఏసుప్రభువు చూసిన సన్మార్గంలో పయనించాలి

సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం డిసెంబర్ 24(వార్తా ప్రభ ప్రతినిధి):- ఇబ్రహీంపట్నంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు.ఈ వేడుకలలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేకును కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ అందరూ ఏసుప్రభువు చూసిన మార్గంలో ప్రయనిస్తూ జాలి, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు అందరూ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. స్వయంగా పిల్లలకు కేకులు తినిపించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ,ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీల బాదుడు పై 27న వైఎస్ఆర్సీపీ పోరుబాట

నిరసన పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి):ఇబ్రహీంపట్నం - కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల మీద కరెంటు చార్జీల పేరిట వేల కోట్ల బాదుడుకు నిరసనగా ఈ నెల 27వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసనలు తెలపాలని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగి రమేష్ కార్యాలయం లో ఇబ్రహీంపట్నం మరియు కొండపల్లి మున్సిపాలిటీ నాయకులు నిరసన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 27 వ తేదీన మైలవరం బోస్ బొమ్మ సెంటర్ వద్ద నుండి ఎలెక్ట్రికల్ ఏడి కార్యాలయం వరకు నిరసన కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ ఇంచార్జ్ జోగి రమేష్ పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

మచిలిపట్నం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి)త్యాగానికి నిలువెత్తు నిదర్శనం క్రీస్తు జీవితమని, ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ శాంతి మార్గాన్ని అనుసరించడమే అసలైన క్రిస్మస్. ఆ పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాలు సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు. ప్రేమ, కరుణ, సేవకు ప్రతీక క్రైస్తవం. ప్రతి ఒక్కరూ ప్రేమతత్వాన్ని పెంపొందించుకోవాలి. ఈర్ష్య ద్వేషాలను వీడి... అందరి సంతోషాన్ని పండుగగా మార్చుకోవాలి. పేదల పట్ల దయ, ధర్మాన్ని నమ్మిన వారికి దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. మైనార్టీ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా నిలుస్తాం. గత ఐ దేళ్లలో జరిగిన విధ్వంసం నుండి ఇప్పుడిప్పుడే రాష్ట్రం కోలుకుంటోంది. పేదరికం లేని సమాజాన్ని స్థాపించేలా ఆ ప్రభువు కరుణ రాష్ట్రంపై ఉండాలి. క్రైస్తవులకు మెరుగైన సంక్షేమం అందించి వారి పురోగతికి ప్రభుత్వం అండగా ఉంటుంది.

సంజా ఉత్సవ్ ఎస్ హెచ్ జి మేళా పోస్టర్ విడుదల

◆ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి) విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో సంజా ఉత్సవ్ ఎస్ హెచ్ జి మేళ 2024, పోస్టర్ను అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ అధికారులతో లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు డిసెంబర్ 26 నుండి 30, 2024 వరకు ఈ మేళా ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళా లో స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన ఉత్పత్తులను ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు, పటమట లోని మేరీస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియం విజయవాడ నందు ప్రదర్శించటమే కాకుండా అమ్మకానికి కూడా కలవని తెలియజేశారు. ఈ నెలలో 100కు పైగా చేనేత మరియు స్వదేశీ ఉత్పత్తుల స్టాల్ ఉండబోతున్నాయి అన్నారు. కేవలం ప్రదర్శన మరియు అమ్మకాలు కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, కిడ్స్ ప్లే మరియు ఫుడ్ కోర్ట్ కలవని కమిషనర్ తెలియజేశారు. కావున ప్రజలందరూ ఈ నెలలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో పిఓయుసిడి వెంకట నారాయణ, టెక్నికల్ ఎక్స్టర్ట్ ఫణి కుమార్, సుజాత, రవిశంకర్, సి ఓ శ్రీనివాస్, ఎం ఐ ఎస్ లక్ష్మి నారాయణ, పాల్గొన్నారు.

కరెంట్ చార్జీల బాదుడు పై డిసెంబరు 27న రాష్ట్రవ్యాప్తంగా అన్నినియోజకవర్గ కేంద్రాల్లో

విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద వైయస్ ఆర్ సిపి నిరసన

కరెంట్ చార్జీల బాదుడు పై వైయస్ ఆర్ సిపి పోరుబాట పోస్టర్ ను విడుదల

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి) మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, పశ్చిమ వైసిపి కార్పొరేటర్లు, నాయకుల చేతులు మీదుగా విద్యుత్తు ఛార్జీల బాదుడు నిరసన ప్రదర్శన పోస్టర్లకు మంగళవారం విడుదల చేశారు. డిసెంబర్ 27 న ఉదయం 9.30 గం.లకు విజయవాడ పశ్చిమలో ఊర్మిళానగర్ వైయస్ ఆర్ విగ్రహం వద్ద నుంచి రామరాజ్య నగర్ సబ్ స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేసే కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, వైసిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయండని మాజీ మంత్రి

వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఏపీలో కరెంట్ చార్జీల బాదుడు పై వైయస్ ఆర్ సిపి అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు డిసెంబరు 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ విద్యుత్ కేంద్రాలలో వైయస్ఆర్సీపీ చేయనున్న కరెంట్ చార్జీల బాదుడు పై వైయస్ ఆర్ సిపి పోరుబాట నిరసన పోస్టర్ ను మంగళవారం నాడు బ్రాహ్మణ వీధిలోని వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పశ్చిమ వైసిపి కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కరెంట్ చార్జీల బాదుడు పై వైయస్ ఆర్ సిపి పోరుబాట వేల కోట్లు బాదుతున్న కూటమి సర్కార్ పై నిరసన స్వరం విప్పే విధంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 27 న ఉదయం గంటలకు ఊర్మిళ నగర్ లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం వద్ద నుంచి కాలినడకన ఊర్మిళా నగర్ ఆటో స్టాండ్, ఏకలవ్యనగర్ మీదుగా జోజినగర్ లోని రామ రాజ్యనగర్ సబ్ స్టేషన్ వద్దకు ర్యాలీగా వెళ్లి, విద్యుత్ శాఖ అధికారులకి వినతి పత్రం అందజేసే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, విజయవాడ పశ్చిమ వైసిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు మండెపూడి ఛటర్జీ, యరడ్ల ఆంజనేయ రెడ్డి, షేక్ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ, యలకల చలపతిరావు, నాయకులు రాయన నరేంద్ర, షేక్ హయత్, సరగడ శంకర్ రెడ్డి, బంక చాము తదితరులు పాల్గొన్నారు

వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

◆ జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలిపట్నం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి)ప్రతీ పౌరుడు వినియోగదారుడే నని, వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినియోగదారుల అవగాహన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. ప్రతీ పౌరుడు చట్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించే దిశగా వినియోగదారుల అవగాహన సదస్సులు నిర్వహించి వినియోగదారుల హక్కులను తెలియజేస్తున్నట్లు చెప్పారు. పాలథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాక్స్ ల్లోని తినుబండారాలు, రోడ్లపై బండ్ల వద్ద తయారయ్యే కలుషిత ఆహార పదార్థాలతో కేన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ గుర్తుచేశారు. ఇటీవల సైబర్ క్రైం నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ – కామర్స్ మోసాలకు గురికాకుండా వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల, పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజేతలకు జాయింట్ కలెక్టర్ నగదుతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగించే గోడపత్రాలను, మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుత వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి. పార్వతి, గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ టి. రాజేంద్రప్రసాద్, ఇది సేఫ్టీ ఆఫీసర్ గోపాలకృష్ణ, కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రతినిధి వేము కోటేశ్వరరావు, వినియోగదారులు, విద్యార్థులు, వాలంటరీ ఆర్గనైజేషన్లు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28న జిల్లాలో పర్యటించనున్న ఏక సభ్య కమిషన్ .

మచిలిపట్నం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి)కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లా లతో పాటు నూజీవీడు కైకలూరు మండలాలకు చెందిన ప్రజలు, వ్యక్తులు, సంస్థలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘాల నాయకుల నుండి అభిప్రాయాలు, విజ్ఞప్తులు, వినతులు స్వీకరణ. ప్రజాభిప్రాయం సేకరించనున్న విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్. ఈ నెల 28వ తేదీన ఎస్సీ వర్గీకరణ పై ఏకసభ్య కమిషన్ జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్ కులాల ఉప-వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ జిల్లాలో పర్యటించనుందన్నారు, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఈనెల 28వ తేదీ శనివారం జిల్లాలలో పర్యటించనుందన్నారు. పర్యటనలో భాగంగా మచిలీపట్నం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్ నందు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు . ఈ సమావేశంలో షెడ్యూల్ కులాలలోని ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన అంశంపై సంబంధిత పూర్వపు జిల్లా, జిల్లా నుండి నూతనంగా ఏర్పడిన జిల్లాలకు సంబంధించిన వ్యక్తులు, సంస్థల నుండి కమిషన్ నేరుగా మెమొరాండం, విజ్ఞప్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, నూజీవీడు కైకలూరు మండలాలకు చెందిన ప్రజలు, వ్యక్తులు, సంస్థలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘాల నాయకుల నుండి అభిప్రాయాలు, విజ్ఞప్తులు, వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కమిషన్ కు నేరుగా సమర్పించలేనివారు తమ విజ్ఞప్తులను గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం, విజయవాడలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ వారి కార్యాలయంలో మెమొరాండం ఇవ్వవచ్చని అన్నారు. ఇంకా అక్నాలెడ్జ్మెంట్తో కూడిన పోస్టు లేదా omcscsubclassification @gmail.comఅనే ఈమెయిల్ ద్వారా 2025 జనవరి 9 వరకూ తమ విజ్ఞప్తులను సమర్పించుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆ ప్రకటనలో తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పదవులు ఇచ్చినందుకు మంత్రి డాక్టర్ నిమ్మలకు కృతజ్ఞతలు

ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ 'ఆళ్ళ' మరియు రాష్ట్ర రైతు సంఘాల నేతలు

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గానికి చెందిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఎన్నికైన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం విజయవాడలోని జలవనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణిలతో నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ నూతన వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు కలిశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో అత్యంత కీలకమైన వైస్ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతగా డాక్టర్ నిమ్మలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ వైస్ ఛైర్మన్ గా తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐ.టి మరియు విద్యాశాఖామాత్యులు నారా లోకేష్, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని మంత్రివర్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, టి.డి.పి జిల్లాల అధ్యక్షులు, ప్రత్యేకంగా సహకారం అందించిన గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నీటి సంఘాలు మరియు రైతు ప్రతినిధులతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లు ఉమ్మడి కార్యాచరణతో పనిచేసి ఆయకట్టు చివరి ప్రాంతానికి సాగర్ జలాలను తీసుకురావటానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టి.డి.పి నీరు– చెట్టు ఫిర్యాదుల విభాగం సభ్యులు చెన్నుపాటి శ్రీధర్, కపులూరి రాజాచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నీతి,నిజాయితీ,నమ్మకానికి మారుపేరు ముస్లిం సమాజం

◆ విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ◆ వెస్ట్ నుంచి టిడిపిలోకి భారీ సంఖ్యలో చేరిన ముస్లిం సోదరులు ◆ వారికి ఆహ్వానం పలికిన ఎంపి కేశినేని శివనాథ్ ◆ టిడిపి కండువా కప్పుకున్న గాలిబ్ షహీద్ దర్గా ప్రెసిడెంట్ మహ్మద్ ముష్టాక్ అహ్మద్ ◆ అహ్మద్ కి మద్దతుగా టిడిపిలో చేరిన 200 మందికి పైగా ముస్లిం సోదరులు ◆ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికిన నెట్టెం రఘురామ్, నాగుల్ మీరా

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ పశ్చిమ నియోజవర్గంలో తనకి 57 వేల మెజార్టీ రావటానికి అన్ని వర్గాలతో పాటు ముస్లిం వర్గం మద్దతు పలికి ఓటు వేసిందని, నీతి, నిజాయితీ, నమ్మకానికి మారు పేరు ముస్లిం సమాజమని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 41వ డివిజన్ కి చెందిన గాలిబ్ షహీద్ దర్గా ప్రెసిడెంట్ మహ్మద్ ముష్టాక్ అహ్మద్ తన మద్దతు దారులు 200మందితో కలిసి టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ , రాష్ట్రం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు నచ్చి మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో టిడిపిలో చేరారు. ముందుగా ముస్లిం నాయకులు ఎంపి కేశినేని శివనాథ్ ను ముస్లిం మత సంప్రదాయం ప్రకారం సన్మానించారు. అనంతరం వీరికి ఎంపి కేశినేని శివనాథ్, టిడిపి ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ముస్లిం సమాజం అభివృద్ధి, అభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. ఆటోమొబైల్ రంగంలో పని చేసిన తమ కుటుంబానికి ముస్లిం సోదరులతో మంచి అనుబంధం వుందన్నారు. మనందరం కలిసికట్టుగా వుండి ఏ చిన్న సమస్య వచ్చినా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా పరిష్కరించుకుందామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే మైనార్టీలకు రక్షణ వుంటుందన్నారు. అలాగే మైనార్టీలకు న్యాయం చేయగల దమ్ము సత్తా వున్న నాయకుడు సీఎం చంద్రబాబు ఒక్కడే అన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్

మీరా మాట్లాడుతూ ఎంపి కేశినేని శివనాథ్ నాయకత్వంలో 200 మందికి పైగా ముస్లిం సోదరులు టిడిపిలో చేరటం చాలా సంతోషంగా వుందన్నారు. పశ్చిమ నియోజకవర్గం టిడిపి మరింత బలోపేతంగా తయారైందన్నారు. ఎంపి కేశినేని చిన్ని మైనార్టీల పక్షపాతి అన్నారు. ఎన్టీఆర్ హయం నుంచి ఇప్పటి వరకు మైనార్టీలకు న్యాయం కేవలం తెలగుదేశం పార్టీ వల్లే జరిగిందన్నారు. గత ప్రభుత్వం మైనార్టీలకు ఏమి చేయలేదన్నారు. రంజాన్ తోపా ఇవ్వకపోవటమే కాదు, మైనార్టీ కార్పొరేషన్ కి నిధులు లేకుండా చేశారని తెలిపారు. . మైనార్టీ కార్పొరేషన్ కు సీఎం చంద్రబాబు నాయుడు 3 వేల 7వందల 86 కోట్ల రూపాయల నిధులు కేటాయించారని తెలిపారు. అందుకే రాష్ట్రంతో పాటు ప్రజలకు ఏమి చేయని జగన్ మోహన్ రెడ్డి వద్దని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా కావాలని ఎన్డీయే కూటమికి 164 సీట్లు అన్ని వర్గాల ప్రజలు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆషా, టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, టిడిపిసీనియర్ నాయకులు బొప్పన భవకుమార్ లతోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24, (వార్తా ప్రభ ప్రతినిధి)పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)కళాశాలలో మంగళవారం కళాశాలలో రోటరాక్ట్ క్లబ్, హాబీస్ క్లబ్, ఎన్.ఎస్.ఎస్ యూనిట్ విభాగాల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ ఎంతో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీడాక్టర్ సి. ఎ. చిత్త అమర సుధీర్ పాల్గొని ముందుగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూఅందరూ ప్రేమ, క్షమాగుణం, కరుణగల మంచి హృదయంతో తోటి వారితో కలిసిమెలసి ఉండాలనిఎంతో మంచి ఆనందకరమైన జీవనాన్ని సాగించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల ట్రెజరర్కాజారాఘవయ్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి సేవ దృక్పథంతో సమాజ శ్రేయస్సుకు పాటుపడాలనిదీవిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణ కుమార్ క్రిస్మస్పండుగకు గల కారణాలను వివరిస్తూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి డాక్టర్ పి.నరేష్, బి.శ్రీకాంత్ రెడ్డి నవీన్ కుమార్, స్టూడెంట్కోఆర్డినేటర్స్ అర్షిత్ భరద్వాజ్, నాగరాజు, రాజు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులుకళాశాల సిబ్బంది అందరూ పాల్గొని ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఒకరికొకరుకేకులు, మిఠాయిలు పంచుకున్నారు.

పరిశోధన రంగంలో నానో టెక్నాలజీ కీలకపాత్ర

విజయవాడ పశ్చిమ, డిసెంబరు 24:(వార్తా ప్రభ ప్రతినిధి)రాబోయే రోజుల్లో గ్లోబల్ సవాళ్ళను ఎదుర్కోవడం, పరిశోధన రంగం తదితర అంశాల్లో నానో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. మమతా కుమారి అన్నారు. 'స్థిరత్వంలో నానో టెక్నాలజీ పాత్ర' అనే అంశంపై ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యాన మంగళవారం కెబిఎన్ కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ముఖ్యవక్తగా పాల్గొన్న మమతాకుమారి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్ళకు నానో టెక్నాలజీ పరిష్కారాలు చూపిస్తుందన్నారు. నానో టెక్నాలజీ పునాదిగా శాస్త్రవేత్తలు ఎంతో కచ్చితమైన ప్రమాణాలతో సరికొత్త ఆవిష్కరణ చెయ్యడం సాధ్యమవుతుందన్నారు. ఎనర్జీ, వైద్యం, పర్యావరణం వంటి కీలకరంగాల ప్రగతి పూర్తిగా నానో టెక్నాలజీ మీద ఆధారపడి ఉందన్నారు. నానో పదార్థాల పరిమాణం, ఆకారం, లక్షణాలు తదితర అంశాల గురించి ఉదాహరణ పూర్వకంగా ఆమె చేసిన ప్రసంగం విద్యార్థులను నానో టెక్నాలజీ దిశగా ఆలోచింపజేసింది. శుద్ధమైన హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే విధానాన్ని కూడా ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణమణి మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిశోధనల పట్ల విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పొందుతూ, తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఉదయ్ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేశ్, అధ్యాపకులు ఎ.ప్రకాష్, బి.శృతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను డ్వాక్రా మహిళలకు ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి):– ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను డ్వాక్రా మహిళలకు ఇవ్వాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షురాలు కుంచం రాజేశ్వరి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పరిధిలో నాలుగు జూనియర్ కళాశాలల్లో ఏజెన్సీలను అక్షయ పాత్రకు ఇవ్వాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. నిరుపేద కుటుంబాల్లో ఉన్న డ్వాక్రా మహిళలకు మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు అప్పగించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ మండల కార్యదర్శి బి.మంగమ్మ, ఉపాధ్యక్షురాలు రూతు, సహాయ కార్యదర్శి రజని, కోశాధికారి కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

. విస్సన్నపేట డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి)స్థానిక మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దె) ఆధ్వర్యంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా పలువురు కలవటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నీరు చెట్టు కమిటీ సభ్యులు కౌలూరి చంద్రమౌళి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం ప్రభాకర్ పలగాని వెంకటేశ్వరరావు (దుంబు) తదితరులు పట్టు శాలువాతో సుగందాది పరిమళాలు వెదజల్లే పుష్పగుచ్ఛాలతో గౌరవప్రదంగా సత్కరించారు.

నేషనల్ కన్స్యూమర్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చి. శ్రీలక్ష్మి తాడిబోయిన పాల్గొనటం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మి కి జిల్లా స్థాయిలో సెకండ్ ప్రైజ్ రావడం, జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అభినందనలు అందుకోవటం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ హైస్కూల్ ఉప్పలపాడు హెచ్ఎం, స్టాఫ్ విద్యార్థిని, విద్యార్థులు శ్రీలక్ష్మి అభినందించడం జరిగింది **-వార్తా ప్రభ, గుంటూరు**

శ్రీ విజేత లో'' ముందస్తు క్రిస్మస్ వేడుకలు''

పొదలకూరు డిసెంబరు 24 (వార్తాప్రభ) పట్టణంలోని లి.శ్రీ విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో "ముందస్తు క్రిస్మస్ వేడుకలు" ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కామాక్షి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధించిన మతం.క్రైస్తవులు క్రైస్తవ మతాన్ని పటిస్తారని క్రైస్తవులు చేసుకునే పండుగలలో " క్రిస్మస్" పండుగ అత్యంత ప్రియమైనదని ఏసుక్రీస్తు జన్మించిన రోజు డిసెంబర్ 25 వ తేదీన క్రీస్తు పుట్టిన ఆ రోజు నాడే క్రిస్మస్ పండుగను ప్రపంచంలో క్రైస్తవులంత మిక్కిలి ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకుంటారని 25న ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది ప్రజల మధ్య మతపరమైన మరియు సాంస్కృతిక వేడుకగా జరుపుకుంటారనీ చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే సమయమిదని ఆమె విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్మస్ తాత సందడిచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విజయబాబు యూత్ ఆధ్వర్యంలో కేక్ లు పంపిణీ

రెడ్డిగూడెం డిసెంబరు 24 (వార్తాప్రభ)మైలవరం నియోజకవర్గం, రెడ్డిగూడెం మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ కెవివి సత్యనారాయణ (విజయబాబు) యూత్ ఆధ్వర్యంలో తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దబాబు) ద్వారా మండలంలో ఉన్న అన్ని చర్చీలకు కేకు లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెదబాబు క్రైస్తవులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కేక్ ల పంపిణీ కార్యక్రమంలో ఉయ్యూరు సుకుమార్ రెడ్డి, ప్రణయ్, చీపు కృష్ణ, వెంకటేశ్వర్రావు, శ్రీనివాస్ రావు, శివు, గోపె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటాం

ప్రతి సమస్య పరిష్కరిస్తాం- ఆర్డీవో మాధురి

విస్సన్నపేట డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి)స్థానిక మండలంలోని నరసాపురం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆర్ డి ఓ మాధురి పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సుల కార్యక్రమంలో భాగంగా భూ సంబంధిత అంశాలపై ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ లక్ష్మీ కళ్యాణి రీ సర్వే డిటి భాస్కర్ గ్రామ సర్పంచ్ మారపోగు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం

-గత ఐదేళ్లలో రోడ్లపై తట్ట మట్టి కూడా వేయలేకపోయారు
-కేంద్రం ఇచ్చే నిధుల్ని కూడా దారిమళ్లించారు
-ఇప్పుడు చేస్తున్న అభివృద్ధిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు

-విజయవాడ భారతి నగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన సమయంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం డిసెంబర్ 24 (వార్తా ప్రభ ప్రతినిధి) రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు విజయవాడ భారతి నగర్ 3వ లైనులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.14 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి చొరవ తీసుకున్న స్థానిక కార్పొరేటర్ సాంబశివరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత పాలకులు విజయవాడ నగరాన్ని అభివృద్ధికి దూరం చేశారని, కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. వారి పాపాల కారణంగానే బుడమేరు వరదలతో విజయవాడ నగరం అతలాకుతలమైందన్నారు. బుడమేరు కాలువ గట్లపై నుండి మట్టి తప్పుకుని అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. అంత పెద్ద స్థాయిలో వరదలు ముంచెత్తినా.. తన కార్యదక్షత, చొరవతో పది రోజుల్లో నగరం మొత్తాన్ని యథా స్థితికి తీసుకొచ్చారు. ఎప్పుడూ ఎక్కడా ఏ ఒక్కరూ ఇవ్వని విధంగా బాధిత కుటుంబాలకు ప్యాకేజీ ఇచ్చారు. గత పాలకులు 15వ ఆర్థిక సంఘం నిధులు దారిమళ్లించారు. రోడ్లు, డ్రైనేజీలు గాలికి వదిలేశారు. కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు.

ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని జగన్ రెడ్డి అండ్ కో నాశనం చేసింది. కానీ ఈ రోజు మాత్రం పిలిస్తే పలికే ప్రభుత్వం వచ్చింది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల నిర్మాణాలు, అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కేంద్రం నుండి భారీగా నిధులు తీసుకొస్తున్నాం. అమృత్ పథకం కింద నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.అమరావతి గురించి కొంత మంది చేతకాని దద్దమ్మలు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. మ్యాచింగ్ గ్రాంట్స్ కూడా ఇవ్వని కారణంగా పనులు నిలిచిపోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే సుమారు రూ.50 వేల కోట్లతో అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి చూపిస్తుంది. ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన గుంతలు పూడ్చివేత చేపట్టాం. రోడ్ల నిర్మాణాలు చేస్తున్నాం. సంక్రాంతి నాటికి గుంతలు రహిత రాష్ట్రం లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలకు కూడా శ్రీకారం చుట్టబోతున్నాం. ఆరు నెలల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. పెట్టుబడులు తీసుకొస్తాం. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

ఈనెల 21 నుండి 25 వరకు శ్రీ కనకదుర్గ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో భవానీలకు భక్తులకు ప్రసాదాల పంపిణీ

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి) శ్రీ కనకదుర్గ భవాని సేవా సమితి ఆధ్వర్యంలో గత 24 సంవత్సరాలుగా భవానీలకు అయ్యప్పలకు శివ స్వాములకు భక్తులకు పళ్ళు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సేవా సమితి నిర్వాహకులు పిళ్ళా దుర్గారావు తెలిపారు, అంజనేయ వాగులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భవానీ దీక్షలు పూర్తి చేసుకొని గిరి ప్రదక్షణ చేసేటువంటి భవానీలకు భవాని భక్తులకు ఈనెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు ప్రతిరోజు భక్తులకు పళ్ళు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు, ఈ సంవత్సరం 25 వ సంవత్సరం సందర్భంగా కార్యక్రమాన్ని మరింత బాగా చేయాలనే తలంపుతో బంగారయ్య కొట్టు సెంటర్ వద్ద అమ్మవారి భారీ సెట్టింగ్ తో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు ఈ ఐదు రోజులపాటు ప్రతిరోజు కూడా నగర ప్రముఖులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని భక్తులకు ప్రసాదాలు అందజేస్తారని తెలిపారు, ఈ సమావేశంలో పట్నాల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

భవాని దీక్షల విరమణ సందర్భంగా బందోబస్త్ ను స్వయంగా పర్యవేక్షించిన నగర పోలీస్ కమీషనర్ ఎస్. వి. రాజ శేఖర బాబు

విజయవాడ పశ్చిమ డిసెంబర్ 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)భవాని దీక్షల విరమణ సందర్భంగా పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మంగళవారం దుర్గా ఘాట్ సమీపంలోని మోడల్ గెస్ట్ హౌస్ లోని కమాండ్ కంట్రోల్ నందు సి.సి.కెమెరాల ద్వారా మరియు డ్రోన్ కెమెరాల లైవ్ వీడియోల ద్వారా అన్ని ముఖ్య ప్రదేశాలలో



భక్తుల రద్దీని పరిశీలించి ఆయా సెక్టార్ లో విధులు నిర్వహించు అధికారులకు మరియు సిబ్బందికి ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. అస్త్రం యాప్ ద్వారా నగరంలోని ట్రాఫిక్ రద్దీని పరిశీలించి ట్రాఫ్ఫిక్ అధికారులకు సూచనలు ఇస్తూ అప్రమత్తం చేసారు.ఈ క్రమంలో పోలీస్ కమీషనర్ గారు మోడల్ గెస్ట్ హౌస్ లోని కమాండ్ కంట్రోల్ నందు విధులు నిర్వహిస్తున్న ఫైర్, ఎలక్ట్రిసిటి, రెవెన్యూ, హెల్త్, దేవస్థాన, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బందితో వారు చేస్తున్న విధులపై మరియు భవాని భక్తులు వారి ప్రయాణం సులభతరం చేయడానికి ఇంకా ఎటువంటి చర్యలు తీసుకుంటే బాగుంటుంది అనే విషయం పై కూలకుషంగా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్ మానిటరింగ్ సిస్టంను వివివిగా భవాని భక్తులు వారి పిల్లల కోసం వినియోగించేలాగా అందరికి అవగాహన కల్పించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుతో పాటు, డి.సి.పి. గౌతమి షాలి , టెంపుల్ ఈ ఓ కే.ఎస్.రామారావు , ఎ.డి.సి.పి. జి.రామకృష్ణ , ఏ.సి.పి. లు, ఇనస్పెక్టర్లు, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పులిగడ్డ ఆక్విడెక్ట్ పరిధిలో ఇసుక తవ్వకాలు సహించేది లేదు.

అధికారులపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆగ్రహం.

అవనిగడ్డ: డిసెంబర్ 24(వార్తాప్రభ ప్రతినిధి)పులిగడ్డ ఆక్విడెక్ట్ పరిధిలో ఇసుక తవ్వకాలను సహించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డ మండలం పులిగడ్డ ఆక్విడెక్టు పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. వాల్టా చట్టం ప్రకారం సాగునీటి కట్టడాలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వకాలు జరపరాదని ఉంటే 100 మీటర్లలో తవ్వకాలు జరుగుతుంటే చూస్తూ కూర్చోవడం, చర్యలు చేపట్టకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతుంటే చర్యలు చేపట్టకపోవడమేమిటని ప్రశ్నించారు. ఇకముందు ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు శ్రద్ధ, బాధ్యత చూపాలని స్పష్టం చేశారు. దివిసీమలోని మూడు మండలాలకు సాగు, త్రాగునీరు అందించే ఆక్విడెక్ట్ పరిరక్షణ కోసం ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుగకుండా గత వైసీపీ ప్రభుత్వంలో పోరాటం చేశామన్నారు. ఆక్విడెక్ట్ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఇటీవల రూ.కోటికి పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు అందరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. తహసీల్దార్ కే.నాగమల్లేశ్వరరావు, ఎస్ఐ కే.శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గోపికా గీతం (తిరుప్పావై)

ధనుర్మాస స్నాన, వ్రత సంకీర్తనం తొమ్మిదవ పాశురం:

"తూమణి మాడత్తుచ్చుట్రుమ్ విళక్కెరియ
ధూపమ్ కమళ త్తుయిలణై మేల్ కణ్ పళరుమ్
మామాన్ మగళే ! మణిక్కదవమ్ తాళ్ తిరవాయ్
మామీర్! అవళై యెళుప్పీరో ఉన్ మగళ్ దాన్
ఊమైయో ? అన్రిచ్చెవిడో ? అనన్దలో
ఏ మప్పెరున్దుయిల్ మన్దిరప్పట్టాళో ?
మామాయన్ మాధవన్ వైకున్దన్ ఎన్రెన్రు
నామమ్ పలవుమ్ నవిన్రేలో రెమ్బావాయ్."

వివరణ:ఓ యాదవాంగనా!నా మేనమామకూతురా! నీవు పట్టుపానుపుపై ఒడలుమరిచి, ఆగరు ధూప పరిమళములో లీనమై నిద్రలో ఉన్నావా? ఆ రత్నపు గడియ తీయబీ మేము కీర్తన పాడుతూ నిన్ను లేపుతున్నాం.

ఓ అత్తమ్మ! నీ కుమార్తె ఇంకా లేవకపోతే, ఇది ఏమిటి పరిస్థితి? ఆ పిల్ల అలసటతో పూర్తిగా క్షీణించిందా?లేక ఆమె శ్రవణశక్తిని కోల్పోయిందా?లేదంటే, ఆమె దివ్యమైన ఆనందంలో మునిగి, లోతైన నిద్రలో ఉందా?మేము ఇక్కడ యదువంశగౌరవుడైన శ్రీకృష్ణుని గుణగానం చేస్తూ, ఆయన మహిమలను స్మరించి పాడుతున్నాము.ఆయన వైకుంఠధాముడుగా, శ్రీమహావిష్ణువుగా, అమోఘమైన శక్తులవాడుగా ప్రసిద్ధి చెందాడు. ఆ గోపికను నిద్రలేపి మా దగ్గరకు పంపుము.

సందేశం:

ఈ పాశురం భక్తులను ఆధ్యాత్మిక మేల్కొలుపు కోసం పిలుస్తుంది. 1. భగవంతుని నామస్మరణతో, ఆయన అనుగ్రహాన్ని పొందగలమనే విశ్వాసాన్ని చూపిస్తుంది. 2. గోపికల లీలలలో దైవిక అనుభవం, ఆరాధన, మరియు సమష్టి భావనకు ఆహ్వానం ఇస్తుంది. 3. ఈ పాశురం సమాజంలో సామూహిక భావాన్ని, దైవ సన్నిధి పొందడానికి ఒకటిగా ఉండటాన్ని సూచిస్తుంది.ఓ యాదవ భామలారా! మేల్కొండి, మనసును దైవానికి సమర్పించి ఆ పరమాత్మను అనుభవిద్దాం.మరి, ఆ గొల్ల గోపికతో కలసి ఆ శ్రీకృష్ణుని సేవలో పాల్గొనడానికి రండి!

ఆండాళ్ తిరువడిగలే శరణం

రచయిత – వై.ఎస్. యాదవ్,
చైర్మన్, జై యాదవ్ జై మాధవ్ ట్రస్ట్.

రాష్ట్రస్థాయిలో లింగారెడ్డి పాలెం పాఠశాల విద్యార్థికి మొదటి స్థానం

కోడూరు,డిసెంబర్ 24(వార్త ప్రభ) :జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన వినియోగదారుల న్యాయ పాలన కు వర్చువల్ విచారణలు,డిజిటల్ సౌలభ్యం అనే అంశం మీద నిర్వహించిన వ్యాసరచన పోటీలో కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కడవకొల్లు అర్చన మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నకుమారి తెలిపారు.విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని, మొదటి బహుమతిగా 7000 రూపాయల నగదు ను అందుకున్నట్లు ఆమె తెలిపారు.రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన అర్చన ను గ్రామ సర్పంచ్ యర్రం శెట్టి శ్రీ దుర్గా, యర్రంశెట్టి దామోదర్ రావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిట్టిప్రోలు శ్రీనివాస్ రావు ఫిజికల్ డైరెక్టర్ బిపిఎల్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ఆదిలాబాద్ డిసెంబర్ 24 (వార్త ప్రభ) : పార్లమెంట్ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా పెద్ద ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బోథ్ అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జ్ ఆడె గజే ందర్ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.దళిత నాయకున్ని రాజ్యాంత నిర్మాతను గౌరవించని సంస్కృతి బీజేపీ నేతలది అన్నారు. ప్రపంచానికే ఆదర్శనీయులైన అంబేద్కర్ ను అవమానించేలా మాట్లాడిన మాటలు యావత్ జాతి ఖండిస్తుందన్నారు.ఇలాంటి వ్యక్తి హోంమంత్రి పదవిలో ఉండడం తగదన్నారు.వెంటనే అలాంటి వ్యాఖ్యలు చేసిన హోంశాఖా మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అలాగే ఎన్డీఏ ప్రభుత్వం అతనిని మంత్రి పదవినుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్కాంగ్రెస్ సీనియర్ నాయకులుమావల ఎంపీపీ, ఏవన్,ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు,ఆదిలాబాద్ అసెంబ్లీ ఎస్.సి వింగ్ సెక్రటరీ పవర్ వసంత్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి,కౌన్సిలర్లు,జిల్లా మాజీ మైనారిటీ అధ్యక్షులు,మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి వెండి పాదుకలు అందజేత

పెడన,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : పట్టణంలో స్థానిక కొత్త పేట వాస్తవ్యులు పేరక నాగేంద్రరావు శేషు కుమారి పెద్ద కుమారుడు జానకీ రామానంద్ రూప దంపతులు పెడన బస్టాండ్ వద్ద గల శ్రీ అభయాంజనేయ స్వామి వారికి సుమారు 50 వేల రూపాయలతో వీటిని తయారు చేయించారు. ఈ నేపథ్యంలో వెండి పాదుకలు వారి గృహం లో పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో పుర వీధుల్లో ఊరేగింపు గా తీసుకు వెళ్లి స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో శివాలయం చైర్మన్ బళ్ల ప్రసాద్ పట్టణ ప్రముఖులు బొడ్డు రామ్మూర్తి బెజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ ఆర్ ఐ గరికపాటి శ్రీధర్ కు మాతృవియోగం

పెడన,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : పెడన మండలం పెనుమల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గరికపాటి శ్రీధర్ కు మాతృవియోగమయింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి కీ. శే గరికపాటి నాగేశ్వరావు గారి సతీమణి అన్నపూర్ణమ్మ మచిలీపట్నం లో పరమపదించారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కుమారులు సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడగా అల్లుడు ఐఆర్ఎస్ అధికారిగా వున్నారు. అన్నపూర్ణమ్మ మృతి పట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చారుమతి రామానాయుడు పెనుమల్లి గ్రామ మాజీ సర్పంచ్ గరికిపాటి వీర వెంకటరావు (చిన్నా) ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఇంకా పలువురు ప్రముఖులు శ్రీధర్ ను పరామర్శించారు.

వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందించిన జాయింట్ కలెక్టర్

పెడన,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : జాతీయ వినియోగ దారుల వారోత్సవాలు సందర్భముగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో విజేతలకు జాయింట్ కలెక్టర్ బహుమతులను మంగళ వారం నాడు అందజేశారు. స్థానిక విశ్వభారతి హైస్కూలుకు చెందిన పరసా దేవీ మహీక్షిత 9 వ తరగతి వక్తృత్వపు పోటీలలో ప్రథమ బహుమతి రౌతుల జ్యోతిక 9 వ తరగతి వ్యాసరచన పోటీలలో తృతీయ బహుమతి సాధించిన సంగతి తెలిసిందే. మచిలీపట్నం కలెక్టరేట్ ఆఫీసులో జరిగిన వినియోగదారుల అవగాహన సదస్సు కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా బహుమతులు అందుకొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ గౌరీ ప్రసాద్ తో పాటు విజేతలైన విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లితండ్రులు అభినందనలు తెలియచేశారు.

పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కోడూరు,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కోడూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి చదివే విద్యార్థులకు లయన్స్ క్లబ్ అఫ్ కోడూరు దివిసీమ చైర్మన్ పూతబోయన సీతారత్నసాయి బాబు ఆర్థిక సహాయంతో స్టడీ మెటీరియల్ ని అందజేశారు. పాఠశాలలో మొదటి సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాస్తున్న సందర్భంగా స్టడీ మెటీరియల్ ను అందించినట్లు సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా సామాజిక సేవను అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు,మీరు కూడా ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై సుధారాణి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు సాయిబాబు అందించిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబెర్ కోట రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు ఊర దాన వెంకట నాగేంద్ర, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో అలసత్వం, కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తున్నారంటూ ఫిర్యాదు

పత్తి పాడు, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : పత్తిపాడు మండలం, ధర్మవరంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి, చేపట్టిన నిర్మాణాల మీద అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ బాధితులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలుమార్లు కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. పంచాయతీ స్థలంలో నిర్మాణాలు తొలగించాల్సిందేనని ఏపీ హైకోర్టు ఉత్తర్వులున్నప్పటికీ పంచాయతీ అధికారులు స్పందించడం లేదంటూ గ్రామానికి చెందిన గొర్ల వెంకటరత్నం మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టు ఆదేశాలు ధిక్కరించినందుకు మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ధర్మవరం గ్రామంలో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో సొసైటీ పాలకమండలిలో సభ్యుడిగా ఉన్న వ్యక్తి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన అంశం మీద ఎమ్మెల్యే, ఆర్డీవో సహా పలువురు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పంచాయతీ సిబ్బంది స్పందించడం లేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే కోర్టులో కేసు వేస్తామని తెలిపారు.

ఈ నెల 28న మెగా వికసిత్ భారత్ జాబ్‌మేళా..

- ఎస్ఎస్సీ నుంచి బీటెక్, పీజీ వరకు ఉద్యోగావకాశాలకు వేదిక
- పోస్టర్లను ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : ఈ నెల 28న నిర్వహించనున్న మెగా వికసిత్ భారత్ జాబ్ మేళాకు సంబంధించిన సమగ్ర సమాచార పోస్టర్లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. విజయవాడ, మొగల్రాజపురంలోని వీరమాచనేని పెద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని.. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకునేలా వివిధ మార్గాల ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నట్లు వెల్లడించారు. యువతకు సుస్థిర ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసిన అర్హత ఉన్నవారికి వివిధ కంపెనీలు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వివరించారు. 50కి పైగా సంస్థల్లో దాదాపు మూడు వేల ఖాళీలు అందుబాటులో ఉన్నాయని, ఔత్సాహిక అభ్యర్థులు https://vikasajobs.com/jobmela_register.php?idR 690 లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. పూర్తి వివరాలకు 77993 76111, 93815 30964 నంబర్లకు ఫోన్ చేయొచ్చన్నారు. జాబ్ మేళాను సద్వినియోగం చేసుకునేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

ఆగిరిపల్లి, డిసెంబర్ 24 (వార్తాప్రభ) : నూజీవీడు సబ్ డివిజన్ ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ .ఈ తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణను సమీక్షించి, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. బాల్య వివాహాలు మరియు సాంఘిక దురాచారాలను అడ్డుకునే చర్యలు తీసుకోవాలని, లోన్ యాప్ మోసాలు మరియు సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు.ఆ ముందుగా జిల్లా ఎస్పీ కి నూజీవీడు డిఎస్పీ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికినారు. అనంతరం సిబ్బంది జిల్లా ఎస్పీ కి గౌరవ వందనం సమర్పించినారు. పోలీస్ స్టేషన్ మరియు పరిసరాలను సందర్శించి, నిర్వహణ మరియు రికార్డుల నిర్వహణను లోతుగా పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ మరియు లాకప్ గదులను పరిశీలించి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిటీషనర్లతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు నిర్వహించే ప్రతి రికార్డును సమీక్షించారు. ఆగిరిపల్లి పోలీసులు గతంలో సీజ్ చేసి స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలు ఏ నేరాలకు సంబంధించినవో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులను ఎస్ఐ, సిఐలతో అడిగి తెలుసుకుని, శాంతి భద్రతల పరిరక్షణ మరియు మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేసుల యొక్క దర్యాప్తు లలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను త్వరగా చేదించాలని, దర్యాప్తు సమయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగించాలి అనే విషయాలపై అధికారులకు జిల్లా ఎస్పీ అవగాహనను కల్పించినారు ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి తో మాట్లాడుతూ ప్రజలకు అతి చేరువుగా ఉండే మీరు ప్రజలకు మెరుగైన సేవలు అందించుట కొరకు గ్రామ సంరక్షణ కార్యదర్శులు పాటుపడాలని, అలాగే రానున్న పండగ రోజులలో మీ మీ ప్రాంతాలలో పేకాట, కోడి పందాలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించి పోలీస్ స్టేషన్ ఎస్. ఐ గారికి తెలియచేయాలని, మహిళలు బాలికల యొక్క రక్షణ కొరకు ఏలూరు జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అభయ రక్షక దళ సభ్యులకు బస్టాండ్ లో వద్ద ఆకతాయిలు వేధింపులకు పాల్పడకుండగా చూడాలని, కోడి పందాలు,పేకాట, క్రికెట్ బెట్టింగ్, నాటు సారా తయారీ మరియు అమ్మకం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన అభయ మహిళా రక్షక దళాలను స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్ల వద్ద గస్తీ తీరేగేలా మహిళా సిబ్బందిని వినియోగించాలని అధికారులకు ఆదేశించారు.జిల్లా ఎస్పీ తో పాటు నూజీవీడు డిఎస్పీ కె వి వి ఎన్ వి ప్రసాద్, నూజీవీడు రూరల్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ , ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విద్యాసాగర్ కు సంపూర్ణ మద్దతు - రవాణాశాఖ ఉద్యోగులు

- ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎ విద్యాసాగర్ కు సంపూర్ణ మద్దతు. - యం. రాజుబాబు, అధ్యక్షుడు ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోన్2

విజయవాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : ఉద్యోగుల సమస్యల పరిష్కారంకోసం సంక్షేమంకోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఏపీ ఎన్జీజీవోస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎ విద్యాసాగర్ ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు గాను రవాణాశాఖ ఉద్యోగుల సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేసేందుకుగాను విద్యాసాగర్ నైతృత్యంలో పూర్తిస్థాయిలో కృషి చేస్తారన్న నమ్మకం ఉందని, ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు యం. రాజుబాబు అన్నారు. స్థానిక బందరు రోడ్డు లోని డీటీసీ కార్యాలయంలో మంగళవారంనాడు ఎన్టీఆర్ జిల్లా రవాణాశాఖ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు యం. రాజుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ ఈనెలాఖరున ఖాళీ కానున్న ఏపీ ఎన్జీజీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి ఎ విద్యాసాగర్ ను ఎన్నుకోవాలని, ఆయనకు జిల్లా ఎన్జీజీవోస్ సంఘంలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన అనుభవం ఉందని రాజుబాబు అన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిని, ఎంతోకాలంగా పెండింగులో ఉన్న ఆర్థికపరమైన బకాయిలను ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించి ఇప్పించగల నాయకుడని విద్యాసాగర్ ను ఆయన కొనియాడాడు. సమర్థవంతమైన నాయకులు నాయకత్వం వహిస్తే ఉద్యోగులు ఆశించిన ఫలితాలు రాగలుగుతాయని విద్యాసాగర్ నాయకత్వంపై పూర్తి నమ్మకంతో ఉద్యోగులు ఉన్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి జరిగే ఎన్నికలో విద్యాసాగర్ విజయం సాధించాలని రవాణాశాఖ జోన్2 ఉద్యోగుల తరపున పూర్తి మద్దతును తెలియజేస్తున్నామని రాజుబాబు తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో జోనల్ సంఘం సహాదక్షురాలు జి ఉషాసుందరి, జోనల్ కమిటీ నాయకులు సత్యన్నారాయణ, రామచంద్రరాజు, వెంకటేశ్వరరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టిడొంకను తలపిస్తున్న నరసింహపురం కోడూరు ప్రధాన రహదారి

కోడూరు,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కోడూరు నుంచి నరసింహ పురం మీదగా విశ్వనాథపల్లి వెళ్ళు ప్రధాన రహదారి మట్టి డొంకను తలపిస్తుంది. ఈ రహదారిపై ప్రయాణించడానికి విద్యార్థులు, వృద్ధులు ,ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు సమయం కావడంతో కనీస బాధ్యత లేకుండా వ్యవసాయ యంత్ర యజమానులు, దమ్ము టాక్టర్ల యజమానులు, ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా యంత్రాలను రోడ్ పై తిప్పడంతో వ్యవసాయ యంత్రాల చైన్ నుంచి, దమ్ము టాక్టర్ల వీల్స్ ల నుంచి వచ్చిన నల్ల మట్టి రోడ్డుపై కుప్పలు కుప్పలుగా పడి అది ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి నాని రహదారి అంతా విస్తరించింది. ఈ రహదారిపై ప్రస్తుతం ప్రయాణించాలి అంటే ఎక్కడ జారీ పడతామో తెలియక వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అయ్యప్పస్వామి వారికి వెండి కవచం బహుకరణ

కోడూరు,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయంలోని మూలవిరాట్ కు అలకరిచేందుకు రూ. 1,50,000 విలువ గల వెండి కవచాన్ని గ్రామానికి చెందిన పూతబోయిన సూర్య ప్రకాశరావు బహుకరించారు. మంగళవారం ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త బడే బావన్నారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీను గురుస్వామి లకు ఈ వెండి కవచాన్ని అందజేశారు. అనంతరం అయ్యప్ప స్వామి వారికి అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి ఇంకొల్లు అశోక్ మహారాజ్, కమిటీ సభ్యులు మత్తి సూరిబాబు, వడ్డే ఎర్ర బుజ్జి,తోట శ్రీనివాసరావు,మరియు కొట్టు రమేష్,యనమదల సుబ్బారావు తదితరులు పాల్గున్నారు.

రేపు కొల్లి నాగేశ్వరరావు గురు స్వర్ణోత్సవం

జి.కొండూరు,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : ఉపాధ్యాయ వృత్తి ని ప్రారంభించి 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విద్యారత్న కొల్లి నాగేశ్వరరావు గురుస్వర్ణోత్సవ వేడుకలు ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని వెలగలేరు గ్రామ శివారు చనమోలు ఫకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 26 డిసెంబర్ 2025 తేదీ గురువారం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు గురుస్వర్ణోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు.కొల్లి నాగేశ్వరరావు మాస్టారు వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న పూర్వ విద్యార్థులు, సన్నిహితులు మరియు శ్రేయోభిలాషుల నిర్వహణలో ఈ గురుస్వర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగు తుంది.కొల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయ వృత్తి (24.12.1974– 2024)ని ప్రారంభించి ఎన్నో అవార్డులు,ప్రశంసలు అందుకున్నారు.ఈ గురు–స్వర్ణోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్,అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంశాఖ మాత్యులు వసంత నాగేశ్వరరావు, మాజీ వ్యవసాయ శాఖ మాత్యులు వడ్డే శోభనాదీశ్వరరావు హాజరుకాను న్నారని, వీరితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు, విద్యాశాఖ ప్రము–ఖులు పాల్గొంటున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం1.00 గంటకు పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఈనెల 28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

జి.కొండూరు,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం కమ్యూనిటీ హాలులో ఈ నెల 28వ తేదీ శనివారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య సమావేశానికి సదరు తప్పక హాజరు కావలసినదిగా కోరారు.

24 గంటల్లోపే రైతు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటామన్నారు. ఫుడ్ కమీషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పేద బలహీన వర్గాలను ఆదుకునే విధంగా వినియోగదారుల చట్టంలో మార్పులను పొందుపరిచారన్నారు. వినియోగదారుడికి నష్టం జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకువచ్చినాయన్నారు. ఏ చిన్న విషయంలో అయినా వినియోగదారుడు నష్టపోతే ఫిర్యాదు చేయవచ్చునన్నారు. రెండు సంవత్సరాల వరకూ ఫిర్యాదు చేయవచ్చన్నారు. చట్టంపై అవగాహన లేకపోవడం వలన అనేకమంది వినియోగదారులు మోసపోతున్నారన్నారు. విద్యార్థుల మన దేశ భావి భారత పౌరులని వీరు చట్టంపై అవగాహనా పెంచుకోవాలన్నారు. టాక్స్ అనేది ప్రభుత్వానికి ఒక ఆదాయ వనరుగా ఉంటుందని దీనిపై నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. వినియోగదారుల హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ జి. వీరపాండ్యన్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది వినియోగదారుల హక్కుల కోసం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వినియోగదారుల హక్కులపై అవగాహనా కోసం అనేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అనేకమైన పోటీలు నిర్వహించామన్నారు. వినియోగదారుల హక్కులను విరివిగా తీసుకువెళ్ళడానికి టెక్నాలజీని ఆయుధంగా వాడుకోవాలని, ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం ఇందులో ఉండాలన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరమ్ చైర్మన్ చిరంజీవి మాట్లాడుతూ వినియోగదారులు హక్కులతో పాటుగా బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. రెండున్నర సంవత్సరాల్లో జిల్లాలో రూ. 7 కోట్ల పరిహారాన్ని అందించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారుల హక్కు చట్టంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత మంత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు.. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు, కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజషన్ సభ్యులకు మంత్రి చేతుల మీదుగా అవార్డు వె–ుమెంటో అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనన్, బిఐఎస్ జేడి రమాకాంత్, సివిల్ సప్లైస్ అధికారులు ప్రసాద్, పాపారావు, లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గాలను అనుసరిస్తూ.. ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి - ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు..
- సీఎం చంద్రబాబుతో కలిసి.. సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు విజయవాడ మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ లోని ఏ ప్లస్ కన్వెన్షన్లో సోమ వారం రాత్రి ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కాగా, మంత్రి కొల్లు రవీంద్ర,ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా క్రైస్తవ విశ్వాసులకు సీఎం చంద్రబాబు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. లోక రక్షకుడైన ప్రభువు కరుణ, కటాక్షాలు ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చంద్రబాబు అన్నారు. ప్రేమ, కరుణ, సేవకు ప్రతీక క్రైస్తవమన్నారు. ఈ సందర్భంగా వేడుకల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. తోటి వారి పట్ల ప్రేమ, కరుణ, దయతో ఉండాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని తెలిపారు. ఆ మార్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ మతపెద్దలకు తినిపించారు. ఎమ్మెల్యేలు మరియు మత పెద్దలు సీఎం చంద్రబాబుకు క్రిస్మస్ కేకు వినిపించారు. క్రైస్తవ మత పెద్దలతో కలిసి సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యేలు క్యాండిల్స్ చేతపట్టుకొని కీర్తనలు ఆలపించారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు ఫరూక్, సవిత, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో కామర్స్ విభాగం తరపున జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వినియోగదారుల హక్కులు, నష్ట పరిహారం, ఫిర్యాదులను హాఫ్ లైన్, ఆన్ లైన్ లో ఏ విధముగా ఇవ్వాలి, వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ఏ ఏ అంశాలు పరిగణలోనికి తీసుకోవాలో అవగాహన నిమిత్తం విద్యార్థులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. కార్యక్రమములో కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ యల్.ఆర్.కే. ప్రసాద్, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్. అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, యు.జి. విభాగాధిపతి అక్కుల గ్రీష్మ, ఎం.కళ్యాణి, ఎస్.కవిత, బి. ప్రసన్న కుమార్, కే. వెన్నెలసంధ్య, పాలిటిక్స్ విభాగాధిపతి ఎ.సునీత, చరిత్ర విభాగాధిపతి ఎన్.నాగలక్ష్మి, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ఐ.డి.ఎల్. భవాని, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈశ్వరమ్మ ఆరాధన ఉత్సవం

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కాలజ్ఞాన ప్రభోధకుడు వీర బ్రహ్మేంద్ర స్వామి వారి బాటలోనే నడుస్తూ స్వామి వారి మనుమరాలు ఈశ్వరమ్మ మానవ జాతి చైతన్యానికి కృషి చేశారని పట్టణ విశ్వ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు వసుధ బసవేశ్వర రావు అన్నారు. వీర బ్రహ్మేంద్ర స్వామి వారి మనుమరాలు, జగన్మాత, జనని ఈశ్వరమ్మ 235 వ ఆరాధన ఉత్సవం మంగళ వారం ఉదయం స్థానిక వీర బ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానంలో పామర్తి రాజారావు దంపతులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధ మాట్లాడుతూ ఈశ్వరమ్మ స్వామి వారి ప్రభావంతో ఆత్మ జ్ఞానాన్ని పొంది, తత్వ బోధలు చేసి మానవాళికి జ్ఞానం ప్రసాదించారన్నారు. బ్రహ్మం గారి తరహా లోనే కాలజ్ఞానం సైతం బోధించి చివరకు జీవ సమాధి పొందారని జెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ, దేవస్థాన ప్రతినిధులు పామర్తి రాజారావు దంపతులు, అమృతలూరి పిచ్చేశ్వర రావు, యలమర్తి కోటేశ్వర రావు, గాయకుడు శనగపాటి నాగేశ్వరరావు, ఆముదాలపల్లి గోపి, సూరిబాబు, గాయని చోడవరపు రూప అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి ప్రకృతితో మమేకమవుదాం -రాష్ట్ర బీసీ శాఖ మంత్రి సవిత

విజయవాడ ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : చెట్లు పెంచుతూ, కేంద్రీయ సాగు చేస్తూ ప్రకృతితో మమేకమవుదామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. చెట్ల పెంపకంతోనే ఆరోగ్యంతో కూడిన ఆయువు లభిస్తుందని వెల్లడించారు. నగరంలోని మొగల్రాజపురంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన ఏపీ ఫ్లవర్ షో ను మంత్రి సవిత మంగళవారం సందర్శించారు. ఫ్లవర్ షో ఏర్పాటు చేసిన 70 స్టాల్లను మంత్రి తిలకించారు. ప్రతి స్టాల్ దగ్గరకెళ్లి మొక్కలు, వాటి రకాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్లను కూడా మంత్రి సందర్శించి, కొనుగోలు చేశారు. ఏయే ప్రాంతాల నుంచి వచ్చారు...అమ్మకాలు ఏ మేర జరుగుతున్నాయా..? అని స్టాల్ల యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పలు మొక్కలు, కేంద్రీయ ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. మొక్కలు కంటికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయన్నారు. విజయవాడలో వరుసగా అయిదు పర్యాయాలు ఫ్లవర్ షోలు ఏర్పాటు చేసిన నిర్వాహకుడు గరిమెళ్ల జానకీరామ్ ను అభినందించారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మొక్కలు పెంపకం ఎంతో అవసరమన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ తో ఉష్ణోగ్రతలు భూమి వేడెక్కుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

ఎండోమెంట్ భూముల నాక్రమించిన వారిపై విచారణ జరిపిస్తాం

- హథీరాంజీ మఠం భూములపై సీఎంకు నివేదిక : నరసింహ యాదవ్

తిరుపతి,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : గత ఐదేళ్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయంలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు, శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన కోట్ల రూపాయలు విలువైన భూములను దోచుకున్నారని, దోచుకున్న భూముల వివరాలను సేకరించి చర్యలు తీసుకొని, ముఖ్యమంత్రికి నివేదికను పంపిస్తామని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో టిడిపి నాయకులతో కలిసి నరసింహ యాదవ్ మాట్లాడారు. హథీరాంజీ మఠంకు చెందిన భూములను ఆక్రమించి ఆ భూములపై కోర్టులలో స్టే ఆర్డర్లు తీసుకువచ్చి ఇస్తానుసారంగా భవంతులు కట్టారని, దీనిపై అధికారులు కోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేసి కేసు పురోగతిని పర్యవేక్షించి, ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నారా లేదా అనే అనుమానాలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న ఏ అధికారులు మార్పు రాలేదని, దీనిపై కూడా సమీక్షించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హథీరాంజీ మఠంకు చెందిన భూములు తిరుపతి నియోజకవర్గంలో పాటుగా చంద్రగిరి నియోజకవర్గంలో వేల ఎకరాలు ఉన్నాయన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం అడ్డగోలుగా దోచుకోవడం చేశారన్నారు. తిరుపతి రూరల్ పరిధిలో ఎక్కువ సంఖ్యలో హథీరాంజీ మఠం భూములు అన్యాక్రాంతం అయ్యాయని, మఠం ద్వారా భూములను లీజుకు పొంది సాగు చేసుకుంటున్న వారిపై కూడా దొంగ డాక్యుమెంట్లను సృష్టించి బెదిరించి ఆ భూములను లాక్కోన్నారని పార్లమెంటు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు వచ్చాయన్నారు. ఈ అర్జీలను అనుసరించి విచారణకు ప్రభుత్వం ఆదేశించేలాగా సమీక్ష సమావేశాలను చేపట్టామన్నారు. ఎం ఆర్ పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మఠం భూమి కోట్ల రూపాయల విలువ చేసేదని, దానిపై కోర్టులో స్టేలు తీసుకువచ్చి విలాసవంతమైన భవనాలు కడుతున్నా మఠం అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. అన్యాక్రాంతమైన దేవాదాయ శాఖకు చెందిన భూములను, హథీరాంజీ మఠం భూములను పరిరక్షించడానికి కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే బీసీలకు నామినేటెడ్ పదవులు ప్రభుత్వం ప్రకటిస్తుందని, ప్రభుత్వ స్థలాల్లో పేదలు, మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అలానే 22 ఏ జాబితాలో ఉన్న భూము లను కూడా పరిశీలించి వాటిని కూడా పరిష్కరించడానికి ప్రభుత్వం సమయత్తం అవుతోందన్నారు. బీసీలకు రక్షణగా అట్రాసిటీ యాక్టు తుది మెరుపులు దిద్దుకుంటోందని, త్వరలో ఈ యాక్టు అమలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టుతోందన్నారు. 35 డివిజన్ కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణ మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిసరాల్లో భారీగా భూకబ్జాలు జరిగాయని, వాటన్నింటిపై కూడా పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్లెన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్, కరాటే చంద్ర, టిడిపి తిరుపతి పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి మనోహర్ ఆచారి, సుబ్బు యాదవ్, రాజయ్య, రవి శంకర్ యాదవ్, గంధం బాబు పాల్గొన్నారు.

ఏసుప్రభువు బోధనలు ఎప్పటికీ అనుసరణీయం : ఎమ్మెల్యే రాము

- క్రైస్తవ సోదర, సోదరీమణులకు..

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదర, సోదరిమనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏసుప్రభువు బోధనలు శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనం, ఎప్పటికి అనుసరణీయమని ఎమ్మెల్యే రాము చెప్పారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడుకుంటూ, పరిపాలన పారదర్శకంగా, ప్రజాస్వామికంగా సాగుతుందని ఎమ్మెల్యే రాము తెలిపారు. ప్రేమ, కరుణ, సేవలతో కూడిన శాంతియుత జీవన మార్గాన్ని ఏసు ఈ ప్రపంచానికి అందించారని ఎమ్మెల్యే రాము అన్నారు. లోకానికి నిస్వార్థ సేవా మార్గాన్ని సూచించారని, లోక రక్షకుడైన ఆయన మార్గం అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. కరుణామయుడైన ఏసు దీవెనలు అందరికీ లభించాలని, ఈ క్రిస్మస్ అందరికీ సంతోషాన్ని, ప్రశాంతతను పంచాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు.

పన్ను బకాయిల వసూళ్ళ పై క్షేత్రస్థాయిలో తనిఖీ..

- అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : కమీషనరు, గుడివాడ పురపాలక సంఘము ఆదేశాల మేరకు మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ పి. శ్రీనివాసరావు.. గౌరీశంకరపురం, బస్టాండ్ రోడ్, ఏలూరు రోడ్, బంటుమిల్లి రోడ్, పెదఎరుకపాడు మరియు బేతవోలు మొదలైన ఏరియాలను ఇన్స్పెక్ట్ చేసి సిబ్బంది తగు సూచనలు ఇచ్చుట జరిగినది. తరువాత రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లిఖార్జునరావుతో కలసి 22వ వార్డుకు సంబంధించిన ఆస్థిపన్ను, నీటి పన్ను బకాయిల వసూళ్ళు గురించి క్షేత్రస్థాయిలో తనిఖీచేయడం జరిగింది. మధ్యాహ్నం టిడ్కో హౌసింగ్ కాలనీలో గ్యాంగ్వర్క్ను ఏర్పాటు చేసి స్పెషల్ శానిటేషన్ చేయించుట జరిగినది. ప్రధానముగా క్రిస్టమస్ సందర్భంగా అన్ని చర్చిల వద్ద స్పెషల్ శానిటేషన్ చేయించి సున్నముతో మార్కింగ్ చేయించుట మరియు అవసరమగు చోట్ల సున్నం మరియు బ్లీచింగ్ చల్లించుట జరిగినది.

గుడివాడ డివిజన్ అకౌంటెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక..

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : గుడివాడ డివిజన్ అకౌంటెంట్స్ అసోసియేషన్, గుడివాడ కార్యవర్గం కాలపరిమితి డిసెంబర్ 2024 తో ముగియు చున్నందున నూతన కార్యవర్గమును ఈనెల 23వ తేదీ సాయంత్రం అసోసియేషన్ ఆఫీసు నందు జరిగిన సర్వసభ్య సమావేశంలో 1-1-2025 నుండి 31-12-2026 సంవత్సరము లకు నూతన కార్యవర్గము ఎకగ్రీవముగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భైరవభొట్ల లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులుగా ఉండవల్లి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శిగా పురాణం నాగ వెంకట సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా రాచకుళ్ళ కోటేశ్వరరావు, కోశాధికారిగా చెన్నూరి నాంచారయ్య మరియు కార్యవర్గ సభ్యులుగా వక్కలగడ్డ రామచంద్రరావు, దావులూరి రామకృష్ణ, తాడికొండ బాపనయ్యి, కొల్లిపర మణికంఠ లను ఏకగ్రీవముగా ఎన్నుకొన్నారు.

నారాయణ స్కూల్ లో క్రిస్మస్ వేడుకలు

మైలవరం,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : స్థానిక నారాయణ స్కూల్లో మంగళవారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ఎ.జి.యమ్.హరిష్ బసవ రాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ యస్.రత్నకుమారి విద్యార్థులకు క్రిస్మస్ ప్రాధాన్యతను తెలియచేశారు.ఈ పండుగ నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణాలను వివరిస్తూ మనకున్న దానిని ఇతరులతో పంచుకోవడం, ప్రేమ, దయ, క్షమ గుణాలన్ని నేర్చుకోవడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.ఇతరులను గౌరవించడం, సాయం చేయడం వంటి మంచి గుణాలను పెంపోందించు కోవాలని విద్యార్థులకు తెలియజేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని విద్యార్థులు బైబిల్ పఠనం,జీసస్ గీతాలాపనలు విద్యార్థులు శాంతాక్లాజ్ గా, ఏంజెల్స్ గా ఆడి, పాడి పాఠశాలలో పండుగ వాతావరణాన్ని ఏర్పరిచారు. ఈ కార్యక్రమంలో అదిలక్ష్మి, ఇ- ఛాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ మనీషా, ఇ- కిట్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎకడమిక్ డీన్ శాంసన్, ఎ.ఓ. దివ్య, ఉపాధ్యాయులు, విద్యార్థు ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానవతా గుడివాడ శాఖ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం కార్యక్రమం..

గుడివాడ,డిసెంబర్ 24 (వార్తాప్రభ) : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, గుడివాడ సభ్యులు మండవ రాజ బాపయ్య గారి 17 వర్ధంతి సందర్భంగా వారి సతీమణి బేబీ సరోజినీ గారి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం 450 మందికి ఏజీకి స్కూల్ పక్కనగల అన్న క్యాంటీన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ దండమూడి జయలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ మానవతాసంస్థ గుడివాడ దండమూడి సీతారామస్వామి, కోశాధికారి గంటా చంద్రశేఖర రావు, కార్యవర్గ సభ్యులు ఘంటసాల రామకృష్ణ, బి రాధాకృష్ణ లక్ష్మయ్య, కొమ్ము వెంకటేశ్వరరావు, మెరుగుమాల బ్రహ్మయ్య, సామి రామ్మోహన్ రావు, ఉప్పలపాటి రాధ.. వారి కుటుంబ సభ్యులు శ్రీ వల్లి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండవ రాజ బాపయ్య గారికి సద్గతి పొందాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కోరుకుంటున్నట్లు సంస్థ కార్యదర్శి నందమూరి పద్మజ పేర్కొన్నారు.

యూనివర్సిటీలను సరస్వతీ నిలయాలుగా మార్చే దిశగా అడుగులు

- భ్రష్టుపట్టిన వ్యవస్థను గాడిలో పెట్టడమే లక్ష్యంగా చర్యలు
- ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉన్నత విద్యలో సంస్కరణలు!
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, పరిశోధన, ప్రమాణాలకు పెద్దపీట
- ఆరునెలల్లోనే అనూహ్య మార్పులకు మంత్రి లోకేష్ శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలు, ఇంజినీరింగ్ II & IV సెమిస్టర్ విద్యార్థుల కోసం స్వయం ం కోర్సులను ఆన్బోర్డ్ చేసి అమలు చేస్తున్నారు. ఇందుకోసం 1,800ం నైపుణ్య కోర్సులను అకడమిక్ క్రెడిట్ ఫ్రేమ్వర్క్లలోకి చేర్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం 22% కళాశాలలు న్యాక్ గుర్తింపు పొందగా, 2028 నాటికి నూరుశాతం NAAC అక్రిడిటేషన్ సాధించేందుకు చురుకైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. మూడు కొత్త కాలేజిలతో సహా 22 ప్రభుత్వ కళాశాలలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా డిజిటలైజేషన్ పై దృష్టి.. రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా డిజిటలైజేషన్ ను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రికార్డు సమయంలో ఇప్పటివరకు 98శాతం మంది విద్యార్థులకు అపార్ ఐడిలు ఇచ్చారు. డిజిటల్ కార్యక్రమాలపై వర్క్ షాపులు నిర్వహించారు. 62.2% అకడమిక్ సర్టిఫికెట్లు డిజిలాకర్కి అప్లోడ్ చేయగా, నూరుశాతం పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టారు. యూనివర్సిటీల్లో పరిశోధనను ప్రోత్సహించడానికి ఒక సమగ్ర ప్రణాళిక తయారు చేశారు. PM-USHA పథకం కింద ప్రారంభించిన 277.74 కోట్ల పనులైన త్వరగా పూర్తిచేసేలా ఆదేశాలు ఇచ్చారు. పూర్వోదయ పథకం కింద రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అకడమిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను బలోపేతం చేసేందుకు 3,324 కోట్లు ప్రతిపాదనలు సిద్ధమయ్యారు. రూసా కింద కడప, విశాఖపట్నం జిల్లాల్లో గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిపివేసిన మోడల్ డిగ్రీ కళాశాలల నిర్మాణ పనులు పూర్తిచేయగా, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.

వినీల నియామకానికి ముమ్మర కసరత్తు.. గతంలో రాజకీయాలకు నిలయంగా తయారైన యూనివర్సిటీలను సరస్వతీనిలయాలుగా మార్చేందుకు పలు కీలక సంస్కరణలు చేపట్టారు. ఇందులో భాగంగా రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యావంతులను వైస్-చాన్స్ లర్లుగా నియమించేందుకు నోటిఫికేషన్లు ఇచ్చి, సెర్చ్ కమిటీలను ఏర్పాటుచేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఐఐటీ మద్రాసు సహకారంతో స్వయం ప్లస్ విధానాన్ని అమలుచేసేలా ఎంఓయు కుదుర్చుకున్నారు. రాష్ట్రంలోని వివిధ డిగ్రీకోర్సుల్లో అన్ని సెమిస్టర్లకు ఈ విధానం అమలు చేయనున్నారు. దీనిద్వారా విద్యతోపాటు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యశిక్షణ కూడా ఇస్తారు. రాష్ట్రంలోని ప్రముఖ పరిశ్రమల సహకారంతో విశ్వవిద్యాలయాల్లో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఐదు అత్యుత్తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నారు. రాబోయే 6 నెలల్లో అకడమిక్ రికార్డులను 85% డిజిటలైజేషన్ను సాధించడం, సమర్థ యూనివర్సిటీ మేనేజ్మెంట్ సిస్టమ్ను అన్ని యూనివర్సిటీల్లో అమలు చేసేలా ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన ఉన్నత విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు మంత్రి లోకేష్ చేపడుతున్న చర్యలపై విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188